

క్రికెట్‌లో ప్రతిభకు పాతర
ఆటతో ఆటలు..!

అండర్‌-14 జట్టులో అనర్హులు..?

ఎంపికలో ప్రైవేటు వ్యక్తుల జోక్యం

న్యాయం చేయాలని పేరెంట్స్‌ కమిటీ డిమాండ్‌



అండర్‌-14 జట్టు ఎంపికకు ఇటీవల హాజరైన క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్‌, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటంటే ఆడించడం..! అది మరిచిపోయి ఆటగాళ్ల జీవితాలతో ఆడుకుంటున్నారు కొందరు. ప్రతిభను ప్రోత్సహించడం మానేసి, సిఫార్సులకు తలొగ్గుతున్నారు. అనర్హులను, వయో పరిమితి దాటినవారిని జట్టుకు ఎంపిక చేస్తున్నారు. నకిలీ ధ్రువపత్రాలను యథేచ్ఛగా వాడుతున్నారు. సరైన శిక్షణ ఇవ్వకుండానే, నేరుగా వారిని బరిలో దించుతున్నారు. ఇదీ.. జిల్లాలో క్రికెట్‌ పరిస్థితి..! ఈ పరిస్థితిలో మార్పు రావాలని, ప్రతిభకు చోటు దక్కాలని క్రీడాకారుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. చాలాకాలంగా ఈ ఆరోపణలు ఉన్నా.. వారు నోరు విప్పలేదు. ప్రశ్నిస్తే.. తమ బిడ్డల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తారన్న భయంతో మౌనంగా ఉండిపోయారు. కానీ ఇటీవల గళం విప్పుతున్నారు. ప్రక్షాళన జరగాలని డిమాండ్‌ చేస్తున్నారు.

ఇదేం ఎంపిక..?

జిల్లాలో క్రికెట్‌ క్రీడాకారుల ఎంపిక తీరుపై (మిగతా 6లో..)







అనంతలో వానకు తడవకుండా వాహనదారుల తంటాలు

చిరు జల్లులు

అనంతపురం అర్బన్‌, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం చిరు జల్లులు పడ్డాయి. అనంతపురం, బెళుగుప్ప, పుట్లూరు, యాడికి, విడపనకల్లు, బొమ్మనహాళ్‌, యల్లనూరు తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. జిల్లాలోని 10 మండలాల్లో సోమవారం వర్షం కురిసింది. అత్యధికంగా తాడిపత్రిలో 4.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. యాడికి 1.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 1.2 సెం.మీ. లోపు వర్షపాతం నమోదైంది. ఆకాశం మేఘావృతం కావడంతో జిల్లా అంతటా చల్లటి వాతావరణం నెలకొంది.

కూలిన హెడ్‌ రెగ్యులేటర్‌ గేట్ల పరిశీలన

బొమ్మనహాళ్‌, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్‌ హెచ్చెల్సీ సెక్షన్‌ పరిధిలోని నాగలాపురం గ్రామ సమీపంలో 116/399 కిలో మీటర్‌ వద్ద ఆదివారం రాత్రి హెడ్‌ రెగ్యులేటర్‌ గేట్లు కూలిపోవడం కలకలం రేపింది. ఘటనా స్థలాన్ని అనంతపురం హెచ్చెల్సీ ఎస్‌ఈఈ సుధాకర్‌రావు, ఈఈ పార్థసారథి, కణేకల్లు డీఈఈ, బొమ్మనహాళ్‌ ఏఈఈ అల్తాఫ్‌ మంగళవారం పరిశీలించారు. దీనివల్ల జరుగుతున్నా నష్టంపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌ఈఈ విలేకరులతో మాట్లాడారు. పాత పడటంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు ఆరు దశాబ్దాల కిందట నిర్మించిన హెచ్చెల్సీలో గేట్లు, అక్వడెక్టులు, ఎస్కేప్‌ చానల్‌ పాడైపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్చెల్సీ పరిధిలో 166, 133, 171, 181 కిలోమీటర్‌ వద్ద హెడ్‌ రెగ్యులేటర్‌ ప్రమాదంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆధునికీకరణ పనులు మధ్యలో ఆగిపోవడంతో మళ్లీ పనులు చేసేందుకు రూ.450 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.



166/399 కిలో మీటర్‌ వద్ద కూలిన గేట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఈఈ

జనవరి వరకు హెచ్చెల్సీకి నీరు

తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీకి వచ్చే ఏడాది జనవరి వరకు నీటి సరఫరా కొనసాగుతుందని ఎస్‌ఈఈ తెలిపారు. హెచ్చెల్సీకి కేటాయించిన 24 టీఎంసీలలో ఇప్పటివరకు 15 టీఎంసీలు అందుకున్నామని, ఇంకా 7 టీఎంసీలు రానున్నాయని ఎస్‌ఈఈ వివరించారు. ఎగువ కాలువ నుంచి వచ్చే డిస్ట్రిబ్యూటరీ, సబ్‌ డిస్ట్రిబ్యూటరీ షట్టర్లు అధ్వానంగా ఉన్నాయని స్థానిక సాగునీటి సంఘం అధ్యక్షులు హనుమన్న, నటరాజ్‌, రాజేష్‌లు ఎస్‌ఈఈ దృష్టికి తీసుకొచ్చారు. మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని వారికి ఎస్‌ఈఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.



నిధి

బుజ్జి తల్లీ.. బజ్జుకో..!
ఇకపై నీకు ఈ నాన్న
గుండె చప్పుడే జోల పాట..!
అమ్మతో
ప్రయాణం అయిపోయింది..!
ఇక నాన్నే అమ్మ కూడా నీకు..!

ఇది.. నాకు
గుండె పగిలే విషాదం..!
గట్టిగా ఏడవాలని ఉంది..!
కానీ.. నువ్వు..
ఉలిక్కిపడి లేస్తే..?
వెక్కి వెక్కి ఏడిస్తే..!
ఓదార్చేందుకు నేను
అమ్మను తీసుకురాలేను..!

ఇక నుంచి..
మనమిద్దరమే..!
చాలా పయనించాలి..!
నీకు తోడు నేనుంటాను..!
ఆకాశమంత ఎత్తుకు
ఎదుగు బుజ్జి తల్లీ...!
అక్కడ అమ్మ ఉంటుంది..
నిన్ను.. హత్తుకుంటుంది..!



లోకాన్ని వీడిన టెకీ.. సురక్ష

ట్రావెల్‌ బస్సు బోల్తా

- సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి మృతి
- ఎనిమిది మందికి గాయాలు
- దామాజిపల్లి వద్ద ప్రమాదం

చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై ఐచర్‌ను ఢీకొట్టి.. ప్రైవేటు ట్రావెల్‌ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బెంగళూరుకు చెందిన టెకీ సురక్ష(32) మృతిచెందారు. ఆమె భర్త వినీత్‌, మూడేళ్ల కూతురు నిధి స్వల్పంగా గాయపడ్డారు. అమ్మ ఇక లేదన్న విషయం అర్థం చేసుకోలేని నిధి.. నాన్న గుండెలపై అమాయకంగా పడుకుని ఉండటం చూపరులను కంటతడి పెట్టించింది. ఈ ప్రమాదంలో వినోద్‌, ముజఫర్‌ ఖాన్‌, అసలా, వెంకట్‌, శిరీష గౌడ్‌, మాలి అనే మరో ఆరుగురు కూడా గాయపడ్డారు. బస్సు అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు, ప్రయాణికులు తెలిపారు.

-ఆంధ్రజ్యోతి, చెన్నేకొత్తపల్లి

(వివరాలు మెయిన్‌లో..)

మంత్రి లోకేశ్‌ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



కనకదాస విగ్రహం వద్ద ఏర్పాట్లను వివరిస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ కళ్యాణదుర్గం పర్యటన నేపథ్యంలో సభావేదిక, ఏర్పాట్లను ఎంపీలు, ఎమ్మెల్యే, జిల్లా అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈనెల 7, 8 తేదీల్లో నారా లోకేశ్‌ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌ వెంకట శివుడు యాదవ్‌, కలెక్టర్‌ ఆనంద్‌, ఎస్పీ జగదీశ్‌ ఏర్పాట్లను పరిశీలించారు. కంబదూరు ప్రధాన రహదారిలో ఉన్న రింగ్‌రోడ్డులో కనకదాస విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరిస్తారు. అక్కడ ఏర్పాట్లపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వివరించారు. సభావేదిక, వాహనాల పార్కింగ్‌, బారికేడ్లు, వాహన రాకపోకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులు సూచించారు. సమన్వయంతో మంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ వర్షాలతో పెను నష్టం

నేల రాలుతున్న చీనీ కాయలు, కంది పూత

వాలిపోతున్న వరి పైర్లు

పెట్టుబడులు కోల్పోతున్న అన్నదాతలు



కన్నీటి వాన..!

మొంథాతో దెబ్బతిన్న పంటలు

13 ఎకరాల్లో సాగు చేశా

ఖరీఫ్‌ సీజన్‌లో వేరుశనగ బదులుగా కంది సాగు చేశా. పూత విరగబూసింది. తుఫాను కారణంగా అది రాలిపోతోంది. ఇప్పటికే లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టా. అప్పుల నుంచి గట్టెక్కవచ్చనుకుంటే తుపాన్‌ గండి కొడుతోంది.

-చిన్న ఓబులప్ప, రైతు, గడేహోతూరు



పుట్లూరు పరిధిలో రాలిన కాయలను చెట్లకింద పోసిన రైతులు

ఖరీఫ్‌ పంటలు కొన్ని కోత దశలో ఉన్నాయి. మరికొన్ని పూత, పిందె దశల్లో ఉన్నాయి. చీనీ కాయలు పక్వానికి వచ్చాయి. ఈ తరుణంలో ఇటీవల మొంథా తుఫాను దెబ్బకు పంటలకు నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్నవి రాలిపోయాయి. కోసిన పంటలు నానిపోయాయి. దీంతో అన్నదాతలు నష్టపోయారు. ఆ గాయం మానుతుండగానే మళ్లీ వానలు మొదలయ్యాయి. దీంతో అన్నదాతలు వణికిపోతున్నారు. పక్వానికి వచ్చిన చీనీకాయలు రాలిపోతున్నాయి. కంది పూత రాలిపోతోంది. వరిపైర్లు వాలిపోతున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామనీ, పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని అన్నదాతలు వాపోతున్నారు. వానలు కొనసాగితే నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉంది.

పుట్లూరు/ఉరవకొండ/బొమ్మనహాళ్‌, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలకు చీనీ కాయలు రాలిపోతుండడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. పుట్లూరు మండలంలో పండిన కాయలు అత్యంత నాణ్యతగా, రుచిగా ఉండడంతో వ్యాపారులే తోటలకు వచ్చి, కొనుగోలు చేస్తుంటారు. వారంరోజుల క్రితం కురిసిన వర్షాలకు పరిస్థితి తారుమారైంది. కాయలు పక్వానికి రావడంతో చెట్లపైనే మాగుతున్నాయి. వర్షాల దెబ్బకు రాలిపోతున్నాయి. పెట్టుబడులైనా వస్తాయో, లేవోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెట్లను పట్టుకుంటే కుప్పలు తెప్పలుగా రాలిపోతున్న చీనీకాయలను ఎవరూ కొనడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు తరలిస్తే 30 కిలోల ప్యాకెట్‌ రూ.60 నుంచి రూ. 80 వరకు అడుగుతున్నారనీ.. ఆ డబ్బు ఆటోల బాడుగకే సరిపోతుందని రైతులు చెబుతున్నారు. దీంతో ఆ కాయలను తోటల గట్లలో పడేస్తున్నారను. మండలంలోని

(మిగతా 6వ పేజీలో....)



బొమ్మనహాళ్‌ మండలం రంగాపురం క్యాంపు వద్ద నేలవాలిన వరి పైరు

పదిలో వందశాతం ఉత్తీర్ణత రావాలి: డీఈఓ



కాలువపల్లి పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే పదో తరగతి పరీక్షలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఉపాధ్యాయులను ఆదేశించారు. బెళుగుప్ప మండలం కాలువపల్లి జడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత అక్కడ పని చేస్తున్న టీచర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అకడమిక్‌ నిబంధనల మేరకు పాఠ్యాంశాల బోధన సాగుతోందా లేదా పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆరా తీశారు. అనంతరం కళ్యాణదుర్గంలోని కరణం చిక్కణ్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు, టీచర్లతో కలిపి సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వచ్చే నాలుగు నెలలు టీచర్లు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, అప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయని తెలిపారు. ఆయన వెంట డీసీఈబీ సెక్రెటరీ గంధం శ్రీనివాసులు, ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్‌ ఉన్నారు.

ecoren WALK-IN INTERVIEWS

Ecoren Energy is looking for experienced professionals for Wind and Solar Power Projects in Kurnool, Anantapur and Kadapa.

: Positions :

Civil Engineers, Electrical Engineers, Site Managers

: Experience :

2–12 years in Wind/Solar Project Execution

Interview Dates :

08th November 2025 — 09:00 AM to 06:00 PM

09th November 2025 — 09:00 AM to 01:00 PM

Venue : HOTEL ALEXANDER, Saptagiri Circle, Anantapur

Contact : 7331122450, Email: hr@ecorenenergy.com

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

సిటీ యూనియన్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌

క్రెడిట్‌ రికవరీ మరియు మేనేజ్‌మెంట్‌ శాఖ

పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్‌, కుంబకోణం - 612001. ఇ-మెయిల్‌ ID: crmd@cityunionbank.in

ఫోన్‌ : 0435-2432322, ఫ్యాక్స్‌ : 0435-2431746

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తులు)

సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ యాక్ట్‌, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌, 2002లోని రూల్‌ 3తో చదువబడే సెక్షన్‌ 13(2) & (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సిటీ యూనియన్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌, పరిపాలనా కార్యాలయం నం.24-బి, గాంధీనగర్‌, కుంబకోణం-612 001 మరియు శాఖ కార్యాలయలలో ఒకటి నం.15/703, కమలా నగర్‌, శ్రీకంఠం సర్కిల్‌, జాన్వాజరన్‌ మార్ట్‌ ఎదురుగా, అనంతపురం- 515001, అనంతపురం శాఖ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన మొత్తం రూ.56,81,245/- (రూపాయలు యాభై ఆరు లక్షల ఎనభై ఒక్క వేల రెండు వందల నలభై ఐదు మాత్రమే) లను నెలవారీ వాయిదాలతో 22.07.2025 నుండి దానిపై వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు నం.1) మెస్సర్స్‌ శ్రీ పద్మావతి ట్రేడర్స్‌, డి.నం.15, శ్రీనివాస కాంప్లెక్స్‌, గుత్తి రోడ్‌, అనంతపురం, ఆంధ్రప్రదేశ్‌- 515001. నం.2) శ్రీ గూడూరు హర్ష వర్ధన్‌, తండ్రి జి.చంద్ర శేఖర్‌, డి.నం.21-35, బచారావు వీధి, ఓల్డ్‌ టౌన్‌, అనంతపురం, ఆంధ్రప్రదేశ్‌-515001. నం.3) శ్రీమతి జి. వైష్ణవి, భర్త హర్ష వర్ధన్‌, డి.నం.21-35, బచారావు వీధి, ఓల్డ్‌ టౌన్‌, అనంతపురం, ఆంధ్రప్రదేశ్‌-515001 లను తిరిగి చెల్లించమని కోరుతూ 24.07.2025 తేది గల డిమాండ్‌ ప్రకటన జారీ చేశారు.

పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన స్వీకరించిన మీదట కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్‌ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్‌ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 01 నవంబర్‌ 2025న స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం రూ.58,44,382- (రూపాయలు యాభై ఎనిమిది లక్షల నలభై నాలుగు వేల మూడు వందల ఎనభై రెండు మాత్రమే) మరియు పూర్తి బకాయిలు చెల్లించునంతవరకు 29.09.2025 నుండి దానిపై వడ్డీని సిటీ యూనియన్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌కు చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్‌ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్‌ 13లోని సబ్‌ సెక్షన్‌ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలు కోరబడుతున్నారు.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు

షెడ్యూల్‌-ఎ:

ఆస్తి నం.1: (శ్రీ గూడూరు హర్ష వర్ధన్‌, తండ్రి జి.చంద్రశేఖర్‌కు చెందిన ఆస్తి)

అనంతపురం రిజిస్ట్రేషన్‌ జిల్లా మరియు సబ్‌-రిజిస్ట్రేషన్‌ జిల్లా మరియు అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఆస్తి మరియు ఆస్తి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నవి: (నమోదిత సేల్‌ డీడ్‌ 5393/2018 తేది.26.04.2018), పాత వార్డు: 4, కొత్త 8, ప్రస్తుతం:12 టి.ఎస్‌ నం.1999/3బి4ఎ, విస్తీర్ణం ఎ.1.11.25 పైకి, విస్తీర్ణం ఎ 0.05.17 పైకి, ప్లాట్‌ నం.5: డోర్‌ నం. పాత: లేదు, కొత్త: లేదు, ప్రస్తుతం: 12/72/EI ప్రస్తుతం: 12/169, అసెస్‌మెంట్‌ నం: పాత: లేదు, కొత్త: లేదు, ప్రస్తుతం: 11844, ప్రస్తుతం: 1001005982, ఎల్‌పి నం.125/81. పైన పేర్కొన్న భవనం కూల్చివేసి ప్రస్తుతం ఖాళీ ప్రదేశం ఉన్నది. సరిహద్దులు: తూర్పు: ప్లాట్‌ నం.8 మరియు 9, పశ్చిమం: 30 అడుగుల రోడ్డు, ఉత్తరం: ప్రస్తుతం ప్లాట్‌ నం.4లో బహిరంగ స్థలం (గతంలో బి.చిన్నప్ప రెడ్డి ఇల్లు), దక్షిణం: పి. తిప్పయ్య శెట్టి విక్రయించిన గూడూరు చంద్రశేఖర్‌ ఇల్లు. కొలతలు: తూర్పు నుండి పశ్చిమం: ఉత్తరం వైపు: 60 అడుగులు లేదా 18.29 మీటర్లు, తూర్పు నుండి పశ్చిమం: దక్షిణం వైపు: 60 అడుగులు లేదా 18.29 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు: 16 అడుగులు లేదా 4.88 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం: పశ్చిమం వైపు: 15 1/2 అడుగులు లేదా 4.72 మీటర్లు. మొత్తం విస్తీర్ణం: 105 చదరపు గజాలు.

ప్రదేశం: అనంతపురం తేది: 01.11.2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్‌, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287

టెలిఫోన్‌ నం.0435-2402322, ఫ్యాక్స్‌:0435-2431746, వెబ్‌సైట్‌:www.cityunionbank.com

భాష లేని చదువు!

తెలుగు, ఇంగ్లీష్‌కు టీచర్ల కరువు

మొత్తం ఆరు పోస్టులూ ఖాళీ

కుంటుపడుతున్న భాషాభివృద్ధి

రాయదుర్గం హైస్కూల్‌లో విద్యార్థుల ఇబ్బందులు



రాయదుర్గం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్‌ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్లు గడిచినా సంబంధిత సబ్జెక్టులకు టీచర్లను నియమించకపోవడంతో తమ పిల్లల విద్యాభివృద్ధి కుంటుపడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి దాకా 722 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 192 మంది పదో తరగతి చదువుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటి వరకు తెలుగు, ఇంగ్లీష్‌ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరు. దీంతో పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం బాగా తగ్గుతోంది. గత ఏడాది 127 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తే 59 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన 68 మంది ఫెయిల్‌ అయ్యారు. ఇందులో 33 మంది తెలుగు, 18 మంది ఇంగ్లీష్‌ సబ్జెక్టుల్లో ఫెయిల్‌ అయ్యారు.



రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ల్యాంగ్వేజ్‌ పోస్టులు ఖాళీ !

ఉన్నత పాఠశాలకు తెలుగుకు మూడు, ఇంగ్లీషుకు మూడు పోస్టులు ప్రభుత్వం కేటాయించింది. అయితే ఒక్క పోస్టులో కూడా ఉపాధ్యాయులు లేరు. దీంతో ఆ రెండు సబ్జెక్టులకు సంబంధించిన పిరియడ్‌లు వచ్చాయంటే విద్యార్థులకు ఆటవిడుపుగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసింది. తొలి ప్రాధాన్యతగా కేటగిరీ 3, 4 పాఠశాలలకు ఇవ్వడంతో కేటగిరి 2 కింద ఉన్న ఈ హైస్కూలుకు ఉపాధ్యాయులను నియమించలేకపోయింది. పైగా పని సర్దుబాటు పేరుతోనైనా తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమించే ప్రక్రియ చేపట్టినప్పటికీ ఇక్కడ పనిచేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదని సమాచారం. జిల్లా కేంద్రానికి సుదూరంగా ఉండటమే ప్రధాన కారణం. దీంతో ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవడం మానేశారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో ల్యాంగ్వేజ్‌ సబ్జెక్టులకు టీచర్లు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ట్యూషన్లకు పంపుతున్నారు. కింది తరగతుల్లో సబ్జెక్టు దెబ్బతింటే దాని ప్రభావం పై తరగతులకు వెళ్లే కొద్దీ ఎక్కువగా ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై హైస్కూల్‌ ప్రధానోపాధ్యాయులు శంకరన్నను వివరణ కోరగా ఆ రెండు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేని విషయం వాస్తవమేనని, సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.



ఇబ్బంది పడుతున్నాం

ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంగ్లీష్‌, తెలుగుకు టీచర్లే లేరు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లా. ఇటీవల ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు తెలియజేశా. ఆయన దీనిపై కలెక్టర్‌తో మాట్లాడి పని సర్దుబాటు విధానంలో వలంటీర్లను నియమించుకుందామని హామీ ఇచ్చారు. ల్యాంగ్వేజ్‌ సబ్జెక్టులకు టీచర్లు లేక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

- విజయ్‌, స్కూల్‌ కమిటీ చైర్మన్‌

పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో..?

ప్రైవేట్‌ పాఠశాలలకు పిల్లలను పంపి చదివించే ఆర్థిక స్తోమత నాకు లేదు. అందుకే ప్రభుత్వ బడికి పంపుతున్నాం. పిల్లలు బాగా చదివి ప్రయోజకులవుతారనుకుంటే ఇక్కడ అయ్యవారు లేరు. నా కొడుకు ఇదే పాఠశాలలో చదువుతున్నాడు. చాలాసార్లు టీచర్లు లేరని చెప్పాడు. నేను కూడా వెళ్లి మాట్లాడా. మా పిల్లలకు ఇంగ్లీష్‌, తెలుగు సబ్జెక్టుల టీచర్లే లేకపోతే పై తరగతుల్లో వారి చదువు ఎలా ఉంటుందో ఊహించుకోండి. ప్రైవేట్‌ ట్యూషన్లకు వెళ్తామని పిల్లలు అడుగుతున్నారు. స్తోమత లేక పంపడం లేదు.

- మంజునాథ, విద్యార్థి తండ్రి



రీ సర్వే తెచ్చిన తంటా..!

- పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- ఆందోళనలో రైతులు
- తహసీల్దార్‌ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ

(6వ పేజీలో...)

బెండ రైతు బెంగ..!

- దిగుబడి తగ్గిన సీడ్‌ బెండ
- పడిపోయిన ధరలు
- తుఫాన్‌తో మరింత నష్టం

(6లో...)

రీ సర్వే తెచ్చిన తంటా..!

పరిష్కారానికి నోచుకోని సమస్యలు
ఆందోళనలో రైతులు
తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ


బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయం

బొమ్మనహాళ్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాపం.. రైతులకు శాపంగా మారింది. తాతల కాలం నుంచీ వస్తున్న భూమి తమది అని చెప్పుకోలేని దుస్థితి దాపురించింది. రీసర్వే పేరుతో గత వైసీపీ ప్రభుత్వం చేసిన రికార్డుల గందరగోళం నేటికీ కొనసాగుతోంది. పట్టా భూములను ప్రభుత్వానివిగా నమోదు చేశారు. నేటికీ ఆ సమస్యలు అలాగే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌పీఎం విధానాలతో భూములు, స్థలాల క్రయవిక్రయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. శాశ్వత భూహక్కు కల్పిస్తామని ఆర్భాటంగా చేపట్టిన రీసర్వే రైతుల పాలిట గుదిబండలా మారింది. సమస్యలు పరిష్కరించాలంటూ రైతులు.. బొమ్మనహాళ్ రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నాలుగు చోట్ల పూర్తి చేశారు. ఉంతకల్లు, కొళగానహళ్లి, బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, శింగానహళ్లి గ్రామాల్లో గత ప్రభుత్వంలో రీసర్వే నిర్వహించారు. రికార్డులు తప్పులతడకగా నమోదు చేశారని రైతులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు.. తమను సంప్రదించకుండా డ్రోన్ కెమెరా ఆధారంతో రీసర్వే చేపట్టడంతో భూముల హద్దులు తారుమారు అయ్యాయని అన్నదాతలు వాపోతున్నారు. రీసర్వే విషయం కూడా చెప్పకపోవడం శోచనీయం. రీసర్వే సమస్యలను పరిష్కరించాలని రైతులు.. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ.. ఎలా చేయాలో తెలియడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం రీసర్వే తప్పిదాలను సరిదిద్దేందుకు గ్రామసభలు నిర్వహించింది. అందులో 300కిపైగా అర్జీలు వచ్చాయి. ఏడాదిలో 150 పరిష్కరించారు. ఇంకా 150కిపైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్‌పీఎం, ప్రభుత్వ, దేవాలయ భూములుగా నమోదు చేసిన తప్పులను పరిష్కరించలేక పోతున్నారు. అధికారుల తప్పిదాల వల్ల తమకు బ్యాంకు రుణాలు రెన్యువల్ చేయడం లేదనీ, భూముల క్రయవిక్రయాలకు ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. రీసర్వే తప్పులను సరిదిద్దడంలో ప్రస్తుత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. రీసర్వేల వల్ల గ్రామాల్లో తమ అనువంశిక, కొనుగోలు ఆస్తులు తప్పులుగా ఉన్నాయంటూ నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తప్పులను సరిదిద్దాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిగా చూపిస్తున్నారు



రీసర్వేలో నా పట్టా భూమిని అన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. సర్వే నంబరు 252లో 2.47, 283లో 2.29 మొత్తం 4.76 ఎకరాలను అన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా చూపించారు. ఎల్‌పీఎం నంబరు ఏమిటో అర్థం కావడం లేదు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించట్లేదు. బ్యాంకు అధికారులు.. పంట రుణమైనా చెల్లించు.. లేదంటే రెన్యూవల్ చేసుకో అని ఒత్తిడి చేస్తున్నారు.

-రుద్రప్ప, రైతు, ఉంతకల్లు

అన్నదమ్ముల భాగాలు కావడం లేదు



మా తల్లి లక్ష్మమ్మ పేరుపై సర్వే నంబరు 220, 221, ఎ1లో 7.19 ఎకరాల భూమి ఉంది. ఇద్దరు అన్నదమ్ము లం భాగా లు చేసుకోవాలని రిజిస్ట్రార్ కార్యాలయనికి రికార్డులతో వెళితే ప్రభుత్వ భూమిగా ఉం దని చెప్పారు. రెవెన్యూ అధికారులను అడిగితే రీసర్వేలో తప్పులు జరిగాయని అంటున్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలి.

-సిద్ధప్ప, రైతు, ఉంతకల్లు

రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తున్నాం



రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తున్నాం రైతుల నుంచి ఆధారాలు తీసుకుని, పరిశీలిస్తున్నాం. మండలంలో గతంలో జరిగిన రీసర్వేలో 100 ఖాతాలకుపైగా ప్రభుత్వ, దేవాలయ భూములుగా నమోదయ్యాయి. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

-మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్


తరలిస్తున్న బెండ
బెండను నూర్పిడి చేస్తున్న రైతులు


బెండ రైతు బెంగ..!

● దిగుబడి తగ్గిన సీడ్ బెండ ● పడిపోయిన ధరలు ● తుఫాన్‌తో మరింత నష్టం

తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలతో నిత్యం నష్టాలు చవిచూస్తున్న రైతులు.. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసినా గట్టెక్కలేకపోతున్నారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో వేరుశనగ తదితర పంటల వల్ల రైతుకు ఆశించినంత దిగుబడి, ధర లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపారు. తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి తదితర మండలాల్లో దాదాపు 300 ఎకరాల్లో సీడ్ బెండ సాగుచేశారు. గత సంవత్సరం క్వింటా రూ. 15వేల నుంచి రూ.20వేల వరకు ధర ఉండేది. ప్రస్తుతం రూ.9,500 నుంచి రూ.10,500 వరకు పలుకుతుండడంతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈసారి వర్షాభావంతో రెండు నుంచి నాలుగు క్వింటాళ్లకు దిగుబడి పడిపోయిందని రైతులు చెబుతున్నారు. వర్షాధారంతో పండే ఈ ఒక్క పంటకు పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఏడాది పొడవునా ఎలా జీవించాలో అర్థంకాని పరిస్థితి ఉందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి వస్తుంది. దిగుబడి తగ్గిన పరిస్థితుల్లో ధర అయినా కొంత వరకూ ఉంటే ఊరటనిచ్చేది. పంట కోత, నూర్పుళ్లకు కూలీల ఖర్చు మరింత భారమవుతోంది. వీటికితోడు మొంథా తుఫాన్ వల్ల బెండ విత్తనం నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో సీడ్‌బెండ వ్యాపారులు లేకపోవడంతో.. నంద్యాల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తారు. సీడ్‌బెండ విత్తనం ఆయుర్వేదం, సబ్బుల తయారీ తదితర వాటికి వాడతారని, ఇక్కడి నుంచి ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుందని వ్యాపారులు తెలిపారు. గతంలో నాణ్యతతోపాటు ధర కూడా బాగా ఉండేదని, ప్రస్తుతం నాణ్యత అంతంతమాత్రంగానే ఉండడంతోపాటు ధరలు తగ్గాయని వారు చెబుతున్నారు.


సీడ్ బెండ

ఈ ఏడాది పూర్తిగా నష్టపోయా



నాకున్న 15 ఎకరాల్లో గత రెండు సంవత్సరాలుగా సీడ్‌బెండ సాగుచేస్తున్నా. గతంలో వేరుశనగ, సజ్జ, కంది తదితర పంటలు సాగుచేసి నష్టపోయాం. మంచి ధరలు ఉన్నాయనే ఆశతో సీడ్‌బెండ సాగు చేస్తున్నా. గత ఏడాది సీడ్‌బెండకు మంచి డిమాండ్ ఉండేది. దిగుబడి కూడా 8నుంచి 10క్వింటాళ్లు వచ్చింది. రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ధర పలకడంతో మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం. ప్రభుత్వమే పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

-మహబూబ్‌బాషా, రైతు, చీమలవాగుపల్లి

పెట్టుబడులు కూడా రాలేదు



నాకున్న ఎనిమిది ఎకరాల్లో సీడ్‌బెండను సాగు చేశా. గతంలో మంచి దిగుబడితోపాటు ధర కూడా ఉండడంతో సీడ్‌బెండ వైపు మొగ్గుచూపా. ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో దిగుబడి తగ్గింది. ఇదే సమయంలో ధర కూడా భారీగా పడిపోయింది. వీటివల్ల నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఏడాది పొడవునా ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ధరలు పడిపోవడంతో అప్పులపాలయ్యాం. వీటికి తోడు మొంథా తుఫాన్ వల్ల బెండ నాణ్యత కూడా తగ్గింది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

-నూర్‌బాషా, రైతు

సోలార్ ఫ్రీ..!



- ఎస్సీ, ఎస్టీలకు వరం
- గృహాలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్
- ముగిసిన టెండర్ల ప్రక్రియ
- **జిల్లాలో 71వేల మందికిపైగా లబ్ధి**
- **41 వేల మంది రిజిస్ట్రేషన్**

సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యం	ఉత్పత్తయ్యే యూనిట్లు (సుమారు)	వినియోగదారుడికి ప్రస్తుతం వస్తున్నబిల్లు	ప్యానెల్ ఏర్పాటు తరువాత వచ్చే బిల్లు	ఏడాదికి ఆదా (సుమారు)
కిలో వాట్	120	రూ.1000	రూ.338	రూ.8వేలు
2 కిలో వాట్లు	240	రూ.2000	రూ.333	రూ.20వేలు
3 కిలో వాట్లు	360	రూ.3000	రూ.293	రూ.32,400

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు సోలార్ విద్యుత్ ఉచితంగా లభించనుంది. వారి గృహాలపై సోలార్ ప్యానెళ్లను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ముగిసినట్లు విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. త్వరలోనే ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియ కూడా మొదలవుతుందని చెబుతున్నారు.

జిల్లాలో 70 వేల ఎస్సీ, ఎస్టీ గృహాలు

జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తంగా ఎస్సీ, ఎస్టీల గృహ విద్యుత్ కనెక్షన్లు 71,170 ఉన్నట్లు గుర్తించారు. ఆ మేరకు సంబంధిత వర్గాల నుంచి సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 41,223 మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

రెండు కిలోవాట్ల వరకు ఉచితం

ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కిలో వాట్ల (లోడ్) వరకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయనున్నాయి. ఇందుకు ఇళ్ల పైభాగంలో 10 చ.మీ. స్థలం అవసరం. అందులో కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకునే వీలుంది. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు భారం తగ్గనుంది. తద్వారా ఉత్పత్తయ్యే కరెంటులో ఇంటి అవసరాలకు పోను.. మిగులును విక్రయించుకోవచ్చు. తద్వారా ఆదాయం సమకూరుతుంది. మిగులు కరెంటు విక్రయం ద్వారా వచ్చే సొమ్మును నేరుగా వినియోగదారుడి ఖాతాలోకి జమచేయనున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

బీసీ వర్గాలకు రాయితీతో..

బీసీ వర్గాలకు రాయితీలో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయనున్నారు. కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ఫలకలు ఏర్పాటు చేసుకునేవారికి కేంద్ర ప్రభుత్వం రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్ల వారికి రూ.78వేలు రాయితీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20వేలు సబ్సిడీ కల్పిస్తోంది. ఆసక్తి కలిగిన వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారాగానీ, విద్యుత్ టోల్ ఫ్రీ నంబరు ద్వారాగానీ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

టెండర్ల ప్రక్రియ పూర్తయింది



ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఏర్పాటు చేస్తారు. కంపెనీలను బట్టి సోలార్ ప్యానెళ్ల ధరలు ఉంటాయి. బీసీ వర్గాలకు రాయితీ ఇవ్వనున్నారు.

- శేషాద్రి శేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ, అనంతపురం

అరటి ఆధారిత వస్తువుల తయారీపై శిక్షణ

పుట్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అరటి ఆధారిత వస్తువుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై జిల్లాలో ఆసక్తి కలిగిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ నెల 6న రాప్తాడులోని టీటీడీసీలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరటి పంట తర్వాత వేస్ట్‌గా తీసివేసిన భాగాల నుంచి దాదాపు 12రకాల వస్తువులను తయారుచేసి మార్కెట్ చేయవచ్చునన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఇటువంటి యూనిట్లు ఇంటిలోనే ఏర్పాటు చేసుకొని ఖాళీ సమయంలో రోజుకు రెండుగంటలు పనిచేస్తే నెలకు రూ.15వేల నుంచి 20వేల వరకు సంపాదించుకొనే అవకాశం ఉందన్నారు. దీనికి అయ్యే పెట్టుబడిని రుణం రూపంలో తామే ఇస్తామన్నారు. ఇచ్చిన రుణానికి 50శాతం సబ్సిడీ కూడా ఉంటుందన్నారు.

సెలవులో వెళ్లిన డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈర్ల భ్రమరాంబిక దేవి సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో ఆమె మంగళ, బుధవారాలు సెలవు పెట్టారు. తిరిగి గురువారం విధుల్లో చేరుతారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శంకర్ నాయక్



ప్రభుత్వ వైద్య విద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఆర్ శంకర్ నాయక్ బాధ్యతలు చేప ట్టారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజశ్రీ ఈ నెల 7వరకు సెలవు పెట్టారు. ఫోరెన్సిక్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ నాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కన్నీటి వాన..!

(5వ పేజీ తరువాయి)

పుట్లూరు, కోమటికుంట్ల, బాలాపురం, గరుగుచింతలపల్లి, గోపరాజుపల్లి, తక్కళ్లపల్లి, నాయకునిపల్లి తదితర గ్రామాల్లో సుమారు 2,700 ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు.

ధరలు బాగున్నా..

చీనీకాయల ధరలు పెరుగున్నాయి. నెల రోజుల క్రితం టన్ను రూ.15వేల నుంచి 20వేల వరకు పలికాయి. ప్రస్తుతం రూ.25వేల నుంచి 30వేలకు పెరిగాయి. దిగుబడి బాగా వస్తే.. అప్పుల గుండం నుంచి బయటపడవచ్చని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. వర్షం కారణంగా కాయలు రాలిపోయి, దిగుబడి ఆశించినస్థాయిలో రాలేదు. ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వర్షాలతో దిగుబడి దక్కక తీవ్ర నష్టం తప్పదని వాపోతున్నారు.

తోటల వద్దే పడేస్తున్నాం..



20 ఎకరాల్లో చీనీ సాగు చేశా. పంట కోత దశలో ఉంది. వర్షాల దెబ్బకు కాయలు విపరీతంగా రాలిపోతున్నాయి. పసుపు రంగులోకి మారిన కాయల వల్ల మిగిలినవి కూడా రాలిపోతున్నాయి. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. మార్కెట్‌లో రాలిపోయిన కాయలను తక్కువ ధరకు అడగుతుండడంతో తోటల వద్దనే పడేస్తున్నా.

- జయుడు, రైతు, కోమటికుంట్ల, పుట్లూరు మండలం

పెట్టుబడులు కూడా రాలేదు



ఐదెకరాల్లో చీనీ సాగుచేశా. ఈ ఏడాది వర్షాల వల్ల అవి కాస్తా పూర్తిగా రాలిపోయాయి. ఎకరాలో 120 చెట్లకు పెట్టుబడి రూ.లక్ష మేర వస్తుంది. వర్షాల వల్ల కాయలు ఇలా రాలిపోతే దిగుబడి తగ్గి నష్టపోవాల్సి వస్తోంది. పెట్టుబడులు కూడా రాలేదు.

- భాస్కర్‌నాయుడు, రైతు, కోమటికుంట్ల

రాలుతున్న కంది పూత


సాగు చేసిన కంది పంట

ఉరవకొండ డివిజన్ పరిధిలో 35,414 హెక్టార్లలో కంది సాగు చేశారు. పంట పెట్టి 120 రోజులు అయింది. పూత, పిందె దశలో ఉంది. తుఫాను వర్షాలకు పూత, పిందె రాలిపోతుండడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.30వేలదాకా పెట్టుబడి పెట్టారు. పూత రాలిపోతే మళ్లీ రావాలంటే రసాయన మందులు పిచికారీ చేయాలి. అందుకు ఎకరాకి మరో రూ.6వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఇది అదనపు ఖర్చు అని వాపోతున్నారు. వర్షాలకు తెగుళ్లు చుట్టుముడుతాయనీ, మచ్చ, కాయతొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

దిగుబడిపై ప్రభావం



ఐదెకరాల్లో కంది సాగు చేశా. ఎకరాకి రూ.30వేలు ఖర్చయింది. పూత రాలడంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది. మళ్లీ పూత రావాలంటే మందులు కొట్టాలి. అదనంగా రూ.6 వేలు ఖర్చవుతుంది.

-కరీం, రైతు, షేక్షానుపల్లి

వరి రైతుల్లో వణుకు

తుఫాను వర్షాలు వరి పంటను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట తడిసి నేలకొరుగుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మంగళవారం ఉదయం తుఫాను ప్రభావంతో బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట, శింగానహళ్లి, రంగాపురం క్యాంపు, ఉప్పరహాళ్, ఎల్బీనగర్ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. గాలివానకు రంగాపురం క్యాంపు వద్ద కొంతవరకు వరిపంట నేలకొరిగింది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పంట ఎండే అవకాశం లేకపోవడంతో తేమ పెరిగి గింజల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఆరుగాలం శ్రమ తుఫానుతో వృథా అవుతుందేమోనని అవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యం నాణ్యత దెబ్బతినడంతో మార్కెట్‌లో సరైన ధర దక్కదేమోనని భయపడుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి సాయికుమార్‌ను అడగ్గా.. కోత దశకు వచ్చిన వరిపంట తడవకుండా వీలైనంత త్వరగా నీటిని బయటకు పంపే చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట కోతలు చేసుకోవాలని అన్నారు.

ఆటతో ఆటలు..!

(5వ పేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా ఒక జట్టు ఎంపికకు వారం నుంచి పదిరోజుల గడువు తీసుకుంటారు. కానీ జిల్లా అండర్-14 బాలుర జట్టు ఎంపికకు ఏకంగా మూడు నెలల గడువు తీసుకున్నారు. సీజన్‌లో క్రికెట్ టోర్నీకి కనీసం 10-15 రోజుల ముందే జట్టును ఎంపిక చేసి, వారికి శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయాలి. అలా కాకుండా ఒక రోజు ముందు జట్టును ఎంపిక చేసి, హడావుడిగా పోటీలకు పంపించారు. ఈ నెల 1వ తేదీ నుంచి కడపలో మొదలైన అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీకి గత నెల 31వ తేదీన జిల్లా జట్టును ఎంపిక చేశారంటే.. పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్క రోజు ముందు జట్టును ఎంపిక చేస్తే, సామగ్రిని సర్దుకుని పొరుగు జిల్లాకు పరిగెత్తడానికీ సమయం సరిపోదు. ఇక జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఫిట్‌నెస్, సాధన మాటేమిటి..?

కుడి ఎడమైతే పొరపాటు లేదా..?

క్రికెట్ జట్టులో స్పెషలిస్టు బ్యాట్స్‌మెన్, బౌలర్లు, ఆల్‌రౌండర్లు ఉంటారు. ఎంతో అవసరం పడితేగానీ స్పెషలిస్టు బ్యాట్స్‌మెన్‌తో బౌలింగ్ వేయించరు. కానీ కడపలో జరిగిన మ్యాచ్‌లో ప్రధాన బ్యాట్స్‌మెన్ చేత మ్యాచ్ బౌలింగ్ వేయించారని, బౌలర్ల చేత బ్యాటింగ్ చేయించారని విమర్శలు వస్తున్నాయి. జట్టు ఎంపికతీరులో లోపాలకు ఇది అద్దం పడుతోందని పేరెంట్స్ కమిటీ విమర్శిస్తోంది. జట్టును సమర్థవంతంగా ఎందుకు నడిపించడం లేదని వారు నిలదీస్తున్నారు. జట్టు ఎంపికలో బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిబంధనలు పాటించడం లేదని బాధిత క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అండర్-14 జట్టులో 14 ఏళ్ల లోపు వయస్సు క్రీడాకారులు ఉండాలని, కానీ నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలతో 16 ఏళ్లవారు కూడా జట్టులో చోటు సంపాదించారని అంటున్నారు.

అన్నీ అనుమానాలే..

తక్కువ స్కోర్, తక్కువ వికెట్లు నమోదు చేసుకున్న క్రీడాకారులను జట్టుకు ఎంపి చేశారనే తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సెలెక్టర్లు ఎటువంటి నిబంధనలు పాటించి క్రీడాకారులను ఎంపిక చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. తమ బిడ్డలు చేసిన స్కోర్‌ను కూడా సరిగా నమోదు చేయలేదని, తక్కువ పరుగులు నమోదు చేసి వారి ఎదుగుదలను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం పట్ల క్రీడాభిమానుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రశ్నించేవారు లేకనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మాజీ ఐపీఎల్ ప్లేయర్ కనుసన్నల్లో ఇదంతా జరుగుతోందనే ప్రచారం ఉంది. ఓ ప్రైవేటు అకాడమీ కోచ్ కూడా జట్టు ఎంపికలో, ఆటలో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం సభ్యులను పలువురు తల్లిదండ్రులు కలిశారు. ప్రతిభగల పిల్లలకు జట్టులో చోటు కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆంధ్రా క్రికెట్ సంఘం సభ్యులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు తమ గోడు వినిపించామని పలువురు తెలిపారు.

నిబంధనల ప్రకారమే..

నిబంధనల ప్రకారమే క్రీడాకారుల ఎంపిక జరుగుతుంది. ఎంపికలో జిల్లా క్రికెట్ సంఘం ప్రమేయం ఉండదు. సెలెక్షన్ కమిటీ సూచించిన క్రీడాకారులను ఎంపిక చేస్తారు. సీజన్‌లో ఆట, ప్రాబబుల్స్‌లో ప్రతిభచాటిన క్రీడాకారులకే ప్రాధాన్యం ఇస్తారు. అండర్-14 బాలుర జట్టు ఎంపిక నిబంధనలకు లోబడే జరిగింది. సందేహాలకు అవకాశమే లేదు. వర్షం, ఇతరత్రా కారణాలతో ప్రాబబుల్స్ మ్యాచ్‌ల ప్రక్రియ ఆలస్యమైంది. జట్టులో చోటు కల్పించాలని పలువురు తల్లిదండ్రులు వచ్చి సంఘం సభ్యులను కలిసిన మాట వాస్తవమే.

బోగస్‌లకు ఏడీసీఏ సహకారం: చంద్రశేఖర్ చౌదరి



అండర్-14 క్రికెట్ జట్టులో బోగస్ బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చి, అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఓ క్రీడాకారుడి తండ్రి చంద్రశేఖర్ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కువ వయస్సున్న క్రీడాకారులను నకిలీ ధ్రువపత్రాలతో అండర్-14 జిల్లా జట్టుకు జిల్లా క్రికెట్ సంఘం (ఏడీసీఏ) ఎంపిక చేయడం దారుణమని అన్నారు. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోకుండా, అర్హులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సీజన్‌తో పాటు ప్రాబబుల్స్ మ్యాచ్‌లలో ప్రతిభను పరిగణలోకి తీసుకోకుండా జట్టును ఎంపిక చేశారని అన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను ప్రాబబుల్స్ మ్యాచ్‌లకు కూడా ఆడించలేదని, ఇది దుర్మార్గమని అన్నారు. 90 ఓవర్ల మ్యాచ్‌కు తన కుమారుడిని చివరి 5 ఓవర్లులో బ్యాటింగ్‌కి పంపించి.. సరిగా ఆడలేదని ఏడీసీఏ చెప్పడం సబబు కాదని అన్నారు. బర్త్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్, బోన్‌టెస్ట్‌ను చేయకుండా అన్ని విభాగాల్లో ఇష్టానుసారంగా జట్టుకు ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. అండర్-14 బాలుర జట్టులో నలుగురు క్రీడాకారులు బోగస్ బర్త్ సర్టిఫికెట్లు పెట్టారనే విషయం ఏడీసీఏతో పాటు సెలెక్టర్లకు కూడా తెలుసని, అయినా పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జట్టు ఎంపిక పట్ల చాలా మంది క్రీడాకారులు, తల్లిదండ్రులు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. బోగస్ సర్టిఫికెట్లపై బహిరంగ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని ఏడీసీఏకు సవాల్ విసిరారు.


కలుపు నిరోధక పట్టలు వాడుతామని రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

తెగుళ్ల నివారణ ఇలా..

గార్లదిన్నె(ఆంధ్రజ్యోతి): ట్రైకోడెర్మా.. సుడోమోస్ మందులు పిచికారీ చేస్తే పండ్లతోటల్లో తెగుళ్లను నివారించుకోవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాధవి సూచించారు. మండలంలోని బూదేడు గ్రామ పరిధిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త మాధవి మాట్లాడుతూ.. పండ్లతోటలకు వేరుకుళ్లు, బంక తెగుళ్లు సోకుతున్నాయన్నారు. వాటి నివారణకు ట్రైకోడెర్మా, సుడోమోస్ డ్రిప్ ద్వారా పిచికారీ చేస్తే తెగుళ్ల నివారణతోపాటు పండ్లమొక్కలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పండ్ల తోటల్లో కలుపు నివారణ మందుల వినియోగం ద్వారా తీవ్ర దుష్పరిణామాలు తలెత్తుతున్నాయన్నారు. కలుపు నిరోధక పట్టలు ఉపయోగించాలన్నారు. మొక్కల మొదలులో కలుపు నిరోధక పట్టలు వేయడం ద్వారా ఆ ప్రాంతంలో గడ్డి మొలవదన్నారు. దీంతో రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు కలుపు బెడద తప్పుతుందన్నారు. ఆ మేరకు కలుపు నిరోధక పట్టలు వినియోగిస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఉమాదేవి, ఆత్మ పీడీ పద్మలత, ఏఓ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

శనగకు తేమ ముప్పు

యల్లనూరు(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలతో శనగ పంటకు తెగుళ్ల ముప్పు పొంచి ఉంది. 20 రోజులక్రితం మండలంలో పప్పుశనగ సాగుచేశారు. పంట విత్తినప్పటి నుంచి ఇప్పటికే మూడుసార్లు వర్షం కురిసింది. లేతదశలో ఉన్న ఈ పంటకు తేమ అధికమైతే నల్లమచ్చ తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. సోమవారం రాత్రి కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో కొన్నిపొలాల్లో నీరు అక్కడే నిలిచిపోయింది. ఇలా నీరు నిలవడం ద్వారా గతంలో నల్లమచ్చ తెగులు వ్యాపించి, పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 3వేల హెక్టార్లలో పంట సాగుచేశారు. విత్తినరోజునే వర్షం రావడంతో మొలకెత్తలేదని రైతులు తెలిపారు. ఇప్పటికే యల్లనూరు, పాతపల్లి, జంగంపల్లి, వెంకటాద్రిపల్లి, కాచర్లకుంట, కృష్ణాపురం గ్రామాల పరిధిలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో విత్తనం వేసినా మొలకెత్తలేదు. ఆయా పొలాల్లో తిరిగి విత్తనం వేయాల్సి ఉంటుంది. నల్లతెగులు ప్రభావం పైరుపై పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

ఏ విధి పగబట్టిందో...!

8 నెలల వ్యవధిలోనే తల్లిదండ్రుల మృతి

అనాథలుగా మారిన పిల్లలు


కుటుంబ సభ్యులతో వరలక్ష్మి

ముదిగుబ్బ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హాయిగా సాగుతున్న సంసారాన్ని విధి కాటేసింది. నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులను బిడ్డలకు దూరం చేసి అనాథలను చేసింది. ముదిగుబ్బకు చెందిన ఓ కుటుంబ విషాద గాథ ఇది.. ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసరెడ్డి(49) ఒక ప్రైవేటు సంస్థలో పనిచేసేవాడు. 8నెలల కిందట కూతురి ఇంటర్మీడియట్ పరీక్షల కోసం విజయవాడకు వెళ్లాడు. గుండెపోటు రావడంతో అక్కడే మరణించాడు. భార్య వరలక్ష్మి(40) నల్లచెరువు మోడల్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. భర్త మరణం, అనారోగ్య సమస్యలతో ఆమె తీవ్రంగా కుంగిపోయారు. ఈక్రమంలోనే ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారింది. దీంతో ఆమెను సోమవారం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె హిమాన్షు విజయవాడలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా.. కుమారుడు కదిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పిల్లల ఆలనా పాలనా వారి చిన్నాన్న మురళి చూసుకుంటున్నట్లు తెలిపారు. ఏడాది వ్యవధిలోనే తల్లిదండ్రులు మరణించడంతో ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంకలో పడి యువకుడి మృతి


బాబావలి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లి గ్రామానికి చెందిన బాబావలి(32) ప్రమాదవశాత్తు వంకలో పడి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు...గ్రామానికి చెందిన బాబావలి ఓ డాబాలో వంట మనిషిగా పనిచేస్తు కుటుంబాన్ని పోషించేవాడు. పనికోసం డాబాకు వెళ్తున్నట్లు సోమవారం ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ఎత్తైన కల్వర్టు నుంచి ప్రమాదవశాత్తు జారీ వంకనీటిలో మునిగిపోయాడు. మంగళవారం ఉదయం నీటిలో తేలాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్యనజ్మాన్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని కదిరి గేటు దగ్గరలో మంగళవారం ఉదయం ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతదేహంపై లేత నీలిరంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయి. మృతుడి వివరాలు తెలిసిన వారు ధర్మవరం రైల్వే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. 8978656463, 9951325345 నంబర్లకు ఫోన్ చేయాలని రైల్వే పోలీసులు తెలిపారు.

ఏఎస్ఐనని చెప్పి మోసం

కుందుర్పి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చిన ఏఎస్ఐని అంటూ సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి మోసం చేశారు. స్థానికంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న సుదర్శన్ రెడ్డి ఓ నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను ఏఎస్ఐ ఆనందరావుననీ, కుందుర్పి స్టేషన్‌కు కొత్తగా వచ్చానని చెప్పారు. తమవారు ఆస్పత్రిలో ఉన్నారనీ, వెంటనే రూ.70 వేలు ఫోన్ పే చేయాలని ఓ నంబర్ ఇచ్చాడు. తరువాత పోలీసు స్టేషన్‌కు వచ్చి నగదు తీసుకెళ్లాలన్నాడు. దానిని నమ్మిన సుదర్శన్ రెడ్డి ఆ మేరకు రూ.70 వేలు ఫోన్ పే చేశాడు. సమీపంలోనే సెల్‌పాయింట్ నిర్వహిస్తున్న అస్లాంబాషా అదే తరహాలో ఫోన్ చేసి, రూ.40 వేలు ఫోన్ పే చేయించుకున్నారు. తరువాత బాధితులిద్దరూ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఆనందరావు గురించి ఆరాతీయగా.. ఆ పేరుతో ఎవరూ లేరని చెప్పారు. దీంతో ఇద్దరూ అవాక్కయ్యారు. తమకు కాల్ వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా.. పనిచేయలేదు. సైబర్ మోసంపై ఎస్ఐ నగేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దీప స్తంభంపై సంస్కృత శాసనం


సంస్కృత శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు మైనాస్వామి, పరిశోధకుడు గోపి

కొత్తచెరువు,నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతదేవరపల్లి గ్రామ సమీపంలోగల లక్ష్మీచెన్నకేశవస్వామి గుడిలోని దీప స్తంభంపై సంస్కృత శాసనం గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి, పరిశోధకుడు గోపి మంగళవారం తెలిపారు. సంస్కృత శాసనంలో శుభమస్తు సంభూత ధాత్రి తిత్వం ప్రరోహ అని ఉందన్నారు. (దీని అర్థం త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కృపతో భూమండలం అభివృద్ధి చెందుతుంది.) గుడి ఎదురుగా ఉన్న రాతి పలక శాసనం తెలుగులో ఉందన్నారు. ఇందులో శాలివాహన శకం 1514 అంటే సామాన్య శకం1592 నాడు రాసినట్లు ఉందన్నారు. విజయనగర సామ్రాజ్య రెండో రాజధాని పెనుకొండ నుంచి పాలన సాగిస్తున్న అరవీటి వంశానికి చెందిన ఒకటో వెంకటపతి రాయల హయాంలో చేసిన భూ దాన అంశం ఇందులో రాసి ఉందని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. ఈ ఆలయానికి 120 ఎకరాల మాన్యం ఉందని ఆలయ అర్చకులు మాధవాచార్యులు తెలిపారు.

మైనింగ్ ప్రాంతాల్లో డ్రోన్ సర్వే


డ్రోన్ సర్వే చేస్తున్న అధికారులు

డి.హీరేహాళ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు మైనింగ్ ప్రాంతంలో అధికారులు డ్రోన్ సర్వే చేస్తున్నారు. సరిహద్దులు చెరిపేసి అక్రమ మైనింగ్ చేపట్టారని సుప్రీంకోర్టుకు ఫిర్యాదులు అందాయి. దీంతో సరిహద్దు సమస్యను తేల్చే విషయమై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. వారంరోజులుగా రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్ ఇతర శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ సర్వేకు సంబంధించి ఏర్పాట్లను చేశారు. సోమవారం నుంచి మల్లప్పనగుడి గ్రామం సమీపంలో ఉన్న ఓఎంసీ మైనింగ్ కంపెనీ, అంతర్‌గంగా మైనింగ్ ప్రాంతాలలో సుమారు 100 ఎకరాలకుపైగా సర్వే చేపట్టారు. ఆయా మైనింగ్ కంపెనీల సరిహద్దులను డ్రోన్ పాయింట్ల ద్వారా గుర్తించారు. ఈ సర్వే ప్రక్రియ ఇంకా వారంరోజుల పాటు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్వే రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సూర్యారావు, రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, డీఆర్ఓ దామోదర్‌రెడ్డి, సర్వేయర్ రవితేజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

కూడేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్(పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కి ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజులుగా డ్యాంలోకి హంద్రీ-నీవా నుంచి 660 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో జల విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. డ్యాంలోకి హంద్రీనీవాతోపాటు లింక్ చానల్ నుంచి వస్తున్న నీరు దాదాపు 700 క్యూసెక్కులుగా ఉంది. జల విద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్‌కు 785 క్యూసెక్కుల నీటిని నియోగిస్తూ కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. ఇన్‌ఫ్లో ఆధారంగా ఔట్‌ఫ్లో కొనసాగిస్తున్నట్లు ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం డ్యాంలో 5.157 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పంచాయతీలకు కొత్తరూపు

క్లస్టర్‌కు మంగళం.. గ్రేడ్ల కుదింపు

జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల ముఖచిత్రం మారనుంది. అందుకు అనుగుణంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ జీఓ ఎంఎస్‌నెంబర్.91ను మంగళవారం విడుదల చేశారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఉన్న క్లస్టర్ వ్యవస్థకు మంగళం పాడనున్నారు. గ్రేడ్లను కూడా కుదించి నాలుగింటికి పరిమితం చేయనున్నారు. పంచాయతీలను స్వతంత్ర యూనిట్‌గా ప్రకటించారు. జిల్లాలో ఉన్న 577 పంచాయతీలకుగాను స్పెషల్‌గ్రేడ్ పంచాయతీలు -14, గ్రేడ్-1 పంచాయతీలు-62, గ్రేడ్-2 పంచాయతీలు-218, గ్రేడ్-3 పంచాయతీలు-283గా నిర్ణయించారు. అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించడం కోసం యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీ సెక్రటరీ పేరును కూడా పీడీఓ (పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా మార్చనున్నారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు సంబంధించి డిప్యూటీ ఎంపీడీఓ కేడర్ అధికారులను నియమించనున్నారు. పంచాయతీలకు ప్రతి విభాగం నుంచి ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, కంట్రీప్లానింగ్, వీధి దీపాలు, ఇంజనీరింగ్, రెవెన్యూ తదితర విభాగాలతో నూతనంగా సిబ్బందిని నియమించనున్నారు. పంచాయతీలను మొత్తం డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఐటీ విభాగాన్ని కూడా అమలులోకి తీసుకురానున్నారు. దీంతో పంచాయితీల ముఖచిత్రం మొత్తం మారనుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమలులోకి తీసుకురానున్నారు.

క్రీడల నిర్వహణను సవాల్‌గా తీసుకోవాలి

సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి

కలెక్టర్ ఆనంద్


సూచనలిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీల నిర్వహణను సవాల్‌గా తీసుకుని, విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. పోటీల నిర్వహణపై స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పోటీల నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల నుంచి వచ్చే ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీసీఎల్‌ఏ విజయలక్ష్మి, మంత్రులు హాజరవుతారన్నారు. ఏపీ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 3వేల మంది పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. అనంతరం వేదిక, స్టేడియం, భోజనం, వసతి సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఇరు జిల్లాల అధ్యక్షులు దివాకర్‌రావు, మధునాయక్, ఏఎంసీ కమిషనర్ బాలస్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దీప్తి, మల్లికార్జున, ఆనంద్ పాల్గొన్నారు.

దారి తప్పిన గురువు

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు


ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్థులు

వజ్రకరూరు(ఉరవకొండ)/అనంతపురం విద్య, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు దారి తప్పాడు. తన వికృత చేష్టలతో వారిని వేధించసాగాడు. కొన్నాళ్లు మౌనంగా భరించిన పిల్లలు చివరకు వాటిని తాళలేక తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు ఆగ్రహంతో పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడి వికృత చేష్టలపై ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి జడ్పీ హైస్కూల్లో జరిగింది. వివరాలు ఇలా... పాఠశాలలో ఎస్ఎస్ టీచర్‌గా పని చేసే సుధాకర్ కొంతకాలంగా విద్యార్థులతో వికృతంగా ప్రవర్తించేవాడు. పిల్లల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడి తీరును నిరసిస్తూ పాఠశాల వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జగదీష్‌కు విన్నవించారు. ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై నాలుగు రోజుల కిందటే తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా వారికి హెచ్‌ఎం సర్ది చెప్పినట్లు తెలిసింది. ఈక్రమంలో ఉపాధ్యాయుడు సుధాకర్ కూడా సెలవులో వెళ్లాడు. అయితే మంగళవారం ఆయన పాఠశాలకు వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలకు చేరుకుని, విద్యార్థులను విచారించారు. పిల్లల అభిప్రాయాలను తీసుకున్నామని, నివేదికను జిల్లా విద్యాశాధికారులకు పంపుతున్నట్లు ఎంఈఓ తెలిపారు.

టీచర్ సుధాకర్ సస్పెన్షన్

క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికను పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద గొడవకు దిగడం, మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గం కావడంతో అధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. సమస్య కలెక్టరు, కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు ప్రకటించారు.

గొడవ నిజమే..!

హెచ్‌ఎం, ఉపాధ్యాయిని మధ్య వార్ వాస్తవమే

వజ్రకరూరు హైస్కూల్‌లో వివాదంపై విచారణ

అనంతపురం విద్య, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వజ్రకరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలి మధ్య గొడవ నిజమేనని తేలింది. పాఠశాలలో జరుగుతున్న రగడ గురించి రాష్ట్రవిద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు ఇంత జరుగుతుంటే ఏమి చేస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు వజ్రకరూరు హైస్కూల్ వివాదంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డిని ఆదేశించారు. ఆయన మంగళవారం వజ్రకరూరు హైస్కూల్‌కు వెళ్లి, ఉదయం నుంచి సాయంత్రం వరకు హెచ్‌ఎం, టీచర్లు, ఇతర నాన్‌టీచింగ్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం హెచ్‌ఎం, గొడవ పడుతున్న టీచరమ్మతో పాటు ఇతర టీచర్లతో విడివిడిగా మాట్లాడి, జరుగుతున్న సంఘటనలపై ఆరాతీశారు. టీచరమ్మపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. హెచ్‌ఎం కూడా అందరినీ కలుపుకొని పోవడం లేదని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. దీనిపై విచారణాధికారి మల్లారెడ్డిని అడగగా, విచారణ చేశామని, అక్కడ వివాదం వాస్తవమేనని, దీనిపై నివేదికను డీఈఓకు అందజేస్తానని తెలిపారు.

ఢిల్లీలో సైన్స్ ఎగ్జిబిషన్‌కు

అనంత విద్యార్థిని


విద్యార్థినిని అభినందిస్తున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గీతారెడ్డి ఢిల్లీలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. అంతరిక్షశాస్త్రంపై ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే పాల్గొననుందని పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా.. అందులో గీతారెడ్డికి అవకాశం దక్కింది. విద్యార్థినిని అనంతపురం రైల్వే స్టేషన్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మంగళవారం అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయులు చంద్రమునయ్య, మేడా ప్రసాద్ అభినందనలు తెలిపారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా టేబుల్‌టెన్నిస్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాండురంగయ్య, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారుల ఎంపిక పోటీలను నగరంలోని సప్తగిరిసర్కిల్‌లో ఉన్న అనంతపూర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. అండర్-15 బాలుర విభాగంలో ఆదిత్య, చేతన్‌మురళీ, డి. ఫిరోజ్, ఆశ్రిత్, విశ్వనాథ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఈషాసంజన, జ్ఞాపిక, హాసిని, ఐశ్వర్య, క్షిప ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల విభాగంలో కుషాల్, సాయిషా, వంశీకృష్ణ, జయాద్, గౌతమ్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 17 నుంచి విశాఖపట్నంలో నిర్వహించే ఏపీ రాష్ట్ర టేబుల్‌టెన్నిస్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు రాజశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్, నజీమ్ పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనలో

జిల్లాకు అన్యాయం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కూడా భారీగా పంట నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు మాట్లాడలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనైనా ఆదుకుంటారనుకుంటే మొండిచేయి చూపారన్నారు. ఖరీఫ్‌లో జూన్ 5 నుంచి ఆగస్టు తొలివారం వరకు 55 రోజులపాటు జిల్లాలో వర్షం కురవలేదన్నారు. సీజన్‌లో నాలుగు నెలలను పరిగణనలోకి తీసుకుని సాధారణ వర్షపాతంగా ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతాంగాన్ని నట్టేట ముంచారని మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం పక్కనే ఉన్న అనంతపురంలో ఒక్క మండలానికీ జాబితాలో చోటివ్వలేదన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీతో పప్పుశనగ విత్తన పంపిణీలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా పునఃసమీక్ష చేసి కరువు మండలాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివాదాలు, అవినీతి బురదలో కూరుకుపోయి.. దానిని అందరికీ అంటించాలని చూస్తున్నారన్నారు. తాను సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నాననీ, ఇలా వివాదాలు, అవినీతి బురదలో దిగిన వారిని చూడలేదన్నారు. అక్రమాలపై ప్రశ్నిస్తే తనపై విమర్శలు చేస్తున్నారనీ, బెదిరించి మాట్లాడకుండా గొంతు నొక్కుతామంటే భయపడే వాడిని కాదన్నారు. ముగ్గురు అన్నదమ్ములం కలిసే ఉన్నామనీ, తమకు 450 ఎకరాలు ఎక్కడున్నాయో చూపించి ఇస్తే మంచిదే అన్నారు. తన పక్కనున్న ఒకరిద్దరు కట్టప్పల మాటలు విని ఏదంటే అది మాట్లాడితే భయపడేవాడిని కాదన్నారు. అందరికీ బుద్ధి చెబుతానని అనంత హెచ్చరించారు.

నేడు ఈ ప్రగతి యాప్‌పై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ ప్రగతి యాప్ వినియోగంపై బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక జూనియర్ అసిస్టెంట్ లేదా టైపిస్టు లేదా కంప్యూటర్ ఆపరేటర్లలో ఎవరో ఒకరు శిక్షణ పొందాలన్నారు. దీనిపై ఆయా మండలాల ఎంపీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ శిక్షణను జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రం సమావేశ భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

ఆంధ్ర జట్టుకు ముగ్గురు జిల్లా క్రికెటర్లు


ఎంకే దత్తారెడ్డి


మహ్మద్ కమిల్


మల్లికార్జున

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-23 వన్డే క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారు. మహ్మద్‌కమిల్, ఎంకే దత్తారెడ్డి, మల్లికార్జున చోటు దక్కించుకోగా.. స్టాండ్‌బైగా అర్జున్ టెండూల్కర్‌ను ఎంపిక చేశారు. వీరు ఈనెల 9 నుంచి బరోడాలో నిర్వహించే అండర్-23 జాతీయస్థాయి వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు తరఫున ఆడతారు. వీరిని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

ఎదురీదుతున్న పాండిచ్చేరి


ఆల్‌రౌండర్ రాజు


కిషన్‌యాదవ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు జాతీయ క్రికెట్ టోర్నీలో భాగంగా ఆంధ్ర అండర్-23 జట్టుతో జరుగుతున్న పోరులో పాండిచ్చేరి జట్టు ఎదురీదుతోంది. పాండిచ్చేరి-ఆంధ్రా అండర్-23 జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 184-3తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రా జట్టు 9వికెట్లు కోల్పోయి 341పరుగల వద్ద డిక్లేర్ చేసింది. బ్యాటర్ తేజ (105) సెంచరీ చేయగా, అభినవ్ 48పరుగులు, రాజు 55పరుగులు, ఆకాష్ 35పరుగులు చేశారు. పాండిచ్చేరి బౌలర్ కిషన్‌యాదవ్ 6వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 14.3ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 37పరుగులు చేసింది. ఆంధ్రా బౌలర్ 3వికెట్లు తీయగా, సుమిత్ వికెట్ తీశాడు. దీంతో చివరి రోజు ఆటపై ఆసక్తి నెలకొంది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగా రెడ్డి, సభ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన ఎస్‌జీఎఫ్ అండర్-14 నెట్‌బాల్ జిల్లా బాల బాలికల జట్లు

నెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక


ఎంపికైన ఎస్‌జీఎఫ్ అండర్-19 నెట్‌బాల్ జిల్లా బాల బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14, 19 బాల, బాలికల జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్-14, 19 నెట్‌బాల్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

- అండర్-14 బాలికల విభాగంలో సుకన్య, మధు, శ్రీజ, అమృత, హర్షిత, దీపాలి, రాఘవశ్రీ, నవ్య, సానియా, సునీత, సౌమ్య, నేత్రలు ఎంపికయ్యారు.
- బాలుర విభాగంలో పవన్‌కుమార్, నవాజ్, మోక్షిత్, రాజు, కార్తీక్, మధుసాయి, భరత్, బాబ్జాన్, మనోజ్, తేజ్‌కుమార్, నరేంద్ర, ధనుంజయ ఎంపికయ్యారు.
- అండర్-19 బాలికల విభాగంలో దీపిక, నందిని, సృజన, పూజ, అలియా అంజుం, హన్సిక, సంయుక్త, కల్పన, అమృత, చైత్ర, శుభాశ్రీ, గీతలు ఎంపికయ్యారు.
- బాలుర జట్టులో నరేంద్ర, జాఫర్, ప్రణీత్‌కుమార్, చరణ్, నాగచైతన్య, హరికృష్ణ, బాబా, అశోక్, రామ్‌చరణ్, కార్తీక్, చేతన్, నానిలు ఎంపికయ్యారు.

కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు రవీంద్ర, వేణు, చరణ్, సునీల్, ఈశ్వర్‌రెడ్డి,, గోవిందు, రమేష్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి: ఎస్ఈ

అనంతపురంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విధుల్లో అప్రమత్తంగా ఉంటూ పనిచేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం మీటింగ్ హాల్‌లో అనంతపురం డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు, జేఎల్ఎంలు, పోల్‌టూపోల్ సిబ్బందికి విద్యుత్ భద్రతపై వర్క్‌షాపు నిర్వహించారు. డివిజన్ ఈఈ జేవీ రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్ఈ శేషాద్రి శేఖర్, టెక్నికల్ ఈఈ ప్రసాద్, అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లావణ్య, ఏపీటీఎస్ సీఐ విశ్వనాథ్‌చౌదరి హాజరయ్యారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న తప్పిదాలు కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లావణ్య ఈశ్రామ్, ఇతర బీమా పథకాల గురించి వివరించారు. అనంతరం సిబ్బందికి సేఫ్టీ కిట్లను అందజేశారు. కమర్షియల్ విభాగం డీఈఈ రామకృష్ణ, ఆపరేషన్ డీఈఈలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రఘు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర॥7382114647
AJA- ATP

MEDICAL ADMISSIONS
తిరుపతిలోని Dr.VBR కళాశాలలో ఇంటర్ పాస్ అయిన వాళ్ళకి B.Sc.(నర్సింగ్), BPT (ఫిజియోథెరపీ),B.Sc MLT, GNM, డిప్లొమా పారామెడికల్ (అనస్థీషియా, కార్డియాలజీ, క్యాత్ ల్యాబ్, డయాలసిస్, OT,DMLT, మెడికల్ ఇమేజింగ్, ఆప్తాల్మిక్, రేడియాలజీ) కోర్సులు కలవు. సంప్ర: 81850 10001.
AJT -1770

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926
AJA-ATP

WANTED
తిరుపతి పట్టణంలో నర్సింగ్ కాలేజీలో హాస్టల్ వార్డెన్ (లేడీస్) & వంట చేయుటకు, కిచెన్ మరియు కాలేజీ క్లీనింగ్ హెల్పర్‌గా భార్యభర్తలు కావలెను. (40సం॥ దాటిన వారు) ఉచిత భోజనము వసతి కల్పించబడును. సంప్ర: 81064 14966
AJT -082601

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

వివరాలు నమోదు చేయాలి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో ఇచ్చిన ఆప్షన్‌కు అనుగుణంగా అన్ని వివరాలు నమోదు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. మంగళవారం ఆయన డీపీఓలతో పాటు సంబంధిత సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ నాగరాజ నాయుడు, ఉరవకొండ డిప్యూటీ ఎంపీడీఓ సతీష్, కణేకల్ డిప్యూటీ ఎంపీడీఓ చంద్రమౌళి, ఉరవకొండ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. స్వమిత్వ నిర్వహణ అందులో ప్రగతిపై కమిషనర్ సమీక్షించారు. అనంతరం స్వర్ణ పంచాయతీలకు సంబంధించి చేపడుతున్న వాటిలో ప్రగతిపై ఆరా తీశారు. ఇందులో వెనకబడిన వారి సమస్య ఏమిటన్నది పరిశీలించాలని డీపీఓను ఆదేశించారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

అనంతపురంరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం వేతనాలు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారానికి 10వ తేదీ విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావుకి వినతి పత్రం ఇచ్చారు.

మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

అనంతపురంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):మట్టి పరీక్షల ఆధారంగా రైతులు ఎరువుల వాడాలని శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇటుకలపల్లి గ్రామ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలోభాగంగా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏఓ శ్రీనాథ్‌రెడ్డి హాజరై సాయిల్ శాంపుల్ కలెక్షన్ ఏవిధంగా తీయాలి, సాయిల్ శాంపుల్ టెస్టింగ్ విధానం గురించి అండ్ జనరేషన్ ఆఫ్ సాయిల్ హెల్త్ కార్డ్స్ ప్రాముఖ్యతను వివరించారు. భూసార పరీక్ష కేంద్రం నివేదిత, ఎంపీఈఓ నళినాక్షి, పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీకి టీడీఎస్ ఇప్పించండి: సర్పంచ్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా పంచాయతీల అభివృద్ధికి సంబంధించి రావాల్సిన టీడీఎస్ ఇప్పించాలని రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌ను కోరారు. మంగళవారం రాప్తాడు సర్పంచ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2022 జూలై వరకు టీడీఎస్ డబ్బు గ్రామ పంచాయతీకి జమ అయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉందన్నారు.

వృత్తి విద్యా నైపుణ్య ప్రదర్శన

అనంతపురం విద్య, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీకేఎస్ జిల్లా పరిషత్ పీఎంశ్రీ ఉన్నతపాఠశాలలో మంగళవారం వృత్తి విద్యా నైపుణ్య ప్రదర్శన నిర్వహించారు. వివిధ విభాగాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు వాటిని స్వయంగా తయారు చేసిన వస్తువులు,పరికరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆస్కూల్ హెచ్ఎం వసుంధరాదేవి, టీచర్లు వాటిని సందర్శించి వారి ప్రతిభను చూసి ఆశ్చర్యపోయారు. ప్రతిభ చాటిన ఆరు ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. విద్యార్థులను, శిక్షకులు మహేష్, కదిరవన్‌లను హెచ్ఎం అభినందించారు.

చెకుముకి పోటీలు

రామగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నతపాఠశాలల విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలను మంగళవారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు డివిజన్‌స్థాయిలో పాల్గొంటారని హెచ్ఎం మహాలక్ష్మి తెలిపారు. పేరూరు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు 10వతరగతి విజయ్‌కుమార్ ప్రథమస్థానంలో, 9వతరగతి అభి రెండవ స్థానంలో, 8వ తరగతి అభిరామ్ మూడో స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఏఈఓల సమస్యలను పరిష్కరించండి



వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మను సత్కరిస్తున్న ఏఈఓలు

అనంతపురం అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఏఈఓల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకు వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓలు) సంఘం నాయకులు కోరారు. సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన నేపథ్యంలో మంగళవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, కోశాధికారి శ్వేత ఆమెకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. నాయకులు శ్రీనివాసరావు, సుజిత, భాగ్యశ్రీ, అక్కమ్మ పాల్గొన్నారు.


మంత్రిని కలిసిన సీపీఐ నాయకులు



మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో సీపీఐ నాయకులు

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను సీపీఐ, పాపంపేట పరిరక్షణ సమితి నాయకులు కలిశారు. మంగళవారం సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో మంత్రిని కలసి వినతి పత్రం ఇచ్చారు. పాపంపేట భూముల గురించి కూలంకశంగామంత్రికి వివరించారు. రాచూరి వెంకట కిరణ్, అతని కుటుంబ సభ్యులు, పాపంపేట గ్రామంలో మొత్తం 296 ఎకరాల విస్తీర్ణంలో తప్పుడు జీపీఏని అనంతపురం రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా సృష్టించారన్నారు. దుండగుల బాధ్యతా రహితమైన చర్యల వలన నివాసితులు, బాధితులు తీవ్రంగా ప్రభావితమయ్యారన్నారు. వీటితోపాటు హెచ్చరిక సైన్ బోర్డులను ఏర్పాటు చేయడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారన్నారు. జీపీఏను వెంటనే రద్దు చేయాలన్నారు. తప్పు చేసిన నిందితుల, అధికారులను శిక్షించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, కార్యవర్గ సభ్యులు జాఫర్, కార్యదర్శి నారాయణ స్వామి, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, రాష్ట్రసమితి సభ్యులు గోవిందు, పాపంపేట భూబాధితులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మంజునాథ్

రాప్తాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి సమీపాన ఉన్న మాంటిస్సోరి పాఠశాలలో చదువుతున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి మంజునాథ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ సమీర, ఎండీ కృష్ణ భరత్ తెలిపారు. ఈనెల 4 వరకూ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ బనబరిచి అనంతపురం జిల్లా జట్టులో స్థానం పొంది జాతీయస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఎంపికైన మంజునాథ్‌ను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మధు, ఇండియన్ వాలీబాల్ కెప్టెన్ కృష్ణమరాజు, కోచ్ టిప్పు సుల్తాన్ అభినందించారు.

కార్తీక దీపం... సకల పాపహరణం

● నేడు కార్తీక పౌర్ణమి



అనంతపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసమంటేనే భక్తిభావం. ఈ మాసంలో పౌర్ణమి రోజు వెలిగించే ప్రతి దీపంలోనూ సాక్షాత్తు త్రయంబకేశ్వరుడు కొలువై వుంటాడన్నది పురాణాలు చెబుతున్న సారాంశం. ఈ పర్వదినంకోసం యావత్ భక్తకోటి వేయికళ్లతో ఎదురుచూస్తుంటుంది. ఈ పౌర్ణమి హిందువులకు పరమపవిత్రమైన రోజు. ఇది మహాశివరాత్రితో సమానమైన పర్వదినం. ఆశ్వీయుజ అమావాస్య దీపావళి మరుసటిరోజునుంచి కార్తీకమాసం ముగిసేవరకూ రోజూ ఉదయం, సాయంత్రం భక్తజనం దీపాలు వెలిగించి పరమశివునికి సంరంభణం చేస్తారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు, పౌర్ణమినాడు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈరోజున శివాలయంలో దీపాలు వెలిగించినవారికి సకల పాపాలు తొలగి, సుఖసంపదలు కలుగుతాయని విశ్వాసం. పలుప్రాంతాల్లో కార్తీకపౌర్ణమినాడు సత్యనారాయణస్వామి వ్రతాలను కూడా నిర్వహిస్తారు. కాగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ముక్కంటి ఆలయాలన్నీ భక్తజనసందోహంతో కిటకిటలాడనున్నాయి.

నేడు మంచులింగ దర్శనం



కార్తీకమాసంలో మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రతియేటా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ప్రత్యేకించి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు మంచులింగ దర్శనం ఏర్పాటు చేశాం. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు దర్శనానికి హాజరయ్యే వేలాదిమంది భక్తులందరికీ ప్రసాద వితరణ చేస్తున్నాం.

-అమిలినేని నరేంద్ర చౌదరి, చైర్మన్, మొదటిరోడ్డు శివాలయం

విశేష పుణ్యఫలం దక్కుతుంది



శివుడు, విష్ణుమూర్తికి చాలా ప్రీతిపాత్రమైనది కార్తీక మాసం. ఈ మాసంలో శివుడు, విష్ణుమూర్తికి ఆరాధనలు చేయడంతో పాటు అయ్యప్ప, భవాని దీక్షపూజలు ప్రారంభమవుతాయి. మహాభారతం కథనానుసారం కార్తికేయుడు తారకాసురుని సంహరించిన రోజే కార్తీకపౌర్ణమి. ప్రజలను తీవ్రంగా హింసిస్తున్న తారకాసురుడు ఇక లేడన్న ఆనందంతో ప్రజలు దీపాలు వెలిగించి సంబరం చేసుకున్నారు. ఈరోజున బ్రాహ్మణులకు దీపదానం చేయడం వల్ల జన్మజన్మల పుణ్యఫలం దక్కుతుంది.

-నరసింహశాస్త్రి, వేదపండితుడు

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

అనంతపురం విద్య, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి పీఆర్‌టీయూ జిల్లాఅధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శితి మ్మారెడ్డి, చంద్రశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం వివిధ పాఠశాలలో సంఘం సభ్యత్వ క్యాంపెయిన్ చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం టీచర్లను టెట్ పరీక్ష మానసికంగా ఆందోళనకు గురిచేస్తున్నాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పీఆర్సీ కమిషన్ నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంవీ శివారెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చైల్డ్‌కేర్ లీవ్‌పై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలి

అనంతపురం విద్య, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మహిళా టీచర్లకు సంబంధించి చైల్డ్ కేర్ లీవ్స్‌పై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వానికి నోబుల్‌టీచర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం నేతలు అనంతపురంరూరల్, గార్లదిన్నె, నార్పల మండలాల్లో సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు ఇచ్చినా స్పష్టంగా లేకపోవడంతో మహిళా టీచర్లు లీవులను వినియోగించుకోలేకపోయారన్నారు. నాయకులు సురేంద్రబాబు, రాజేష్ పాల్గొన్నారు.

అరటి చెట్ల నరికివేత

నార్పల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లి గ్రామంలో రవీంద్రరెడ్డి అనే రైతుకు చెందిన 42 అరటి చెట్లను గుర్తు తెలియని దుండగులు నరికివేశారు. గ్రామంలో రవీంద్రరెడ్డి మూడు ఎకరాల పొలంలో అరటి పంటను సాగు చేశాడు. ప్రస్తుతం పంట గెలదశలో ఉంది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు 42 అరటి చెట్లను నరికివేశారు. ఉదయం రైతు పొలానికి వెళ్లగా చెట్లు నరికిన విషయాన్ని గుర్తించి నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సాగర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

గార్లదిన్నె, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామంలో నాగవేణి అనే మహిళపై వరుసకు కొడుకైన వంశీ బ్లేడ్‌తో సోమవారం సాయంత్రం దాడిచేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన మేరకు పెనకచెర్ల గ్రామానికి చెందిన ఏకాంబరప్ప, నాగేంద్ర అన్నదమ్ముళ్లు ఇటీవల గొడవపడ్డారు. నాగేంద్ర భార్య నాగవేణిపై ఏకాంబరప్ప కుమారుడు వంశీ బ్లేడ్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నాగవేణిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

అనంతపురం వైద్యం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పారిశుధ్య కార్మికులు మంగళవారం ధర్నాకు దిగారు. ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, సూపర్‌వైజర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆ సంఘం నాయకులు నారాయణ, ముర్తుజా హాజరై మాట్లాడారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులపై నిబంధనల కత్తిపెట్టి గెంటివేస్తామని బెదిరంపులకు దిగడం దుర్మార్గమని మండిపడ్డారు. ఐదేళ్లలో ఏఒక్క నెలకూడా సక్రమంగా జీతాలిచ్చిన పాపానపోలేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి మొత్తాలను చెల్లించకుండా జేబులు నింపుకుని వెళ్లారని మండిపడ్డారు. నూతన ఏజెన్సీ నిర్వాహకులైనా కార్మికులకోసం నిబంధనలు సడలించి, వారి సంక్షేమానికి పాటుపడాలని కోరారు.

దక్షిణ కొరియా సదస్సుకు మేయర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో 5వతేదీ నుంచి జరిగే అంతర్జాతీయ స్థాయి సదస్సుకు అనంత నగర మేయర్ మహ్మద్ వసీం వెళ్లనున్నారు. అండోంగ్-సిలో జరగే సదస్సుకు మేయర్‌కి అందిన ఆహ్వానం మేరకు బయలుదేరి వెళ్లారు. మానవ వనరులు, సామాజిక సవాళ్ల, నిపుణుల అభివృద్ధి తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

శాస్త్రీయ ఆలోచనలతోనే ఆవిష్కరణలు: రెక్టార్

రాప్తాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ వెంకటనాయుడు అన్నారు. మండలంలోని గొల్లపల్లి మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఇప్పటి నుంచే శాస్త్రీయంగా ఆలోచించడం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులకు సృజనాత్మకత ఎంతో అవసరమని, అది భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేర్చగలదని జేవీవీ ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాకే భాస్కర్ అన్నారు. ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మకత అవసరం

అనంతపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైన్స్‌తో కూడిన సృజనాత్మకత అవసరమని జీవశాస్త్ర అధ్యాపకురాలు అరుణ అన్నారు. జనవిజ్ఞాన వేదిక



మాట్లాడుతున్న అధ్యాపకురాలు అరుణ

నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి మండలస్థాయి సైన్స్ సంబరాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో శాస్త్రీయ ఆలోచనలతో కూడిన విద్యాభ్యాసం ఎంతో అవసరమని, అలాంటివారు మాత్రమే జీవితంలో ఉన్నతస్థాయిలో రాణించగలుగుతున్నారని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల పరీక్షల్లో 52 జట్లకు 156 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జేవీవీ నగర అధ్యక్ష కార్యదర్శులు కేఎస్ఎస్ ప్రసాద్‌రెడ్డి, సాకే తిరుమల్, నారాయణప్ప, కోశాధికారి రామిరెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ముత్యాలు, మారెన్న, సమత నాయకురాలు నాగరత్న పాల్గొన్నారు.

ఎన్‌ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం లైసెన్స్ రద్దు

అనంతపురం అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు కళ్యాణదుర్గం రోడ్డులోని ఎన్‌ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం లైసెన్స్ రద్దు అయ్యింది. ప్రభుత్వ అనుమతిలేని ఎరువులను అనధికారికంగా నిల్వ ఉంచడంతోపాటు రైతులకు విక్రయించడం, బిల్లులు ఇవ్వకపోవడం, స్టాక్ బుక్ నిర్వహించకపోవడంపై అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ఆ దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కనగానపల్లి మండలం బోయవాండ్ల కొట్టాల గ్రామానికి చెందిన రైతు మోహన్ అనంతపురంలోని ఎన్‌ఆర్ ఫర్టిలైజర్స్‌లో ఇటీవల ఎరువులు కొనుగోలు చేశాడు. ఆ డీలర్ రైతుకు రసీదు ఇవ్వకుండా పేపర్‌పై ఎరువుల ధరలు రాసి ఇచ్చారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకు బాధిత రైతు ఫిర్యాదు చేశారు. గత నెల 30న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ వెంకట్‌కుమార్ ఆ ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేశారు. ధరల పట్టికలో ఎలాంటి స్టాక్ వివరాలు పొందుపర్చకపోవడాన్ని గమనించారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లను నిర్వహించలేదని గుర్తించారు. ప్రభుత్వ అనుమతి లేని 3 కంపెనీలకు చెందిన రూ.26 లక్షల విలువైన 120 బస్తాల కాంప్లెక్స్ ఎరువులను సీజ్ చేశారు. ఎరువులు తీసుకొచ్చిన మూడు ఆటోలను సీజ్ చేసి, భద్రత నిమిత్తం అనంతపురంరూరల్ పోలీసులకు అప్పగించారు. కలెక్టర్ కోర్టులో అనధికారిక ఎరువుల నిల్వలపై సదరు డీలర్‌పై 6-ఏ కేసు నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్‌ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం లైసెన్స్‌ను రద్దు చేశారు.

రేషన్ దుకాణంలో తూకాల్లో తేడా

● సీజ్ చేసిన డీఎస్ఓ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుల్జార్‌పేటలో ఓ రేషన్ దుకాణంలో తూకాల్లో తేడాలు, ఉండాల్సిన బియ్యం నిల్వ కన్నా తక్కువ ఉండటంతో పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం డీఎస్ఓ వెంకటేశ్వర్లు గుల్జార్‌పేటలోని 33వ రేషన్ దుకాణాన్ని తనిఖీ



వివరాలు నమోదు చేస్తున్న డీఎస్ఓ

చేశారు. ఆ సమయంలో పీడీఎస్ బియ్యం 7500కిలోలు ఉండాల్సి ఉండగా 350కిలోలు తక్కువగా ఉన్నాయి. చక్కెర 378 ప్యాకెట్లు(అరకిలో) ఉండగా 361 ప్యాకెట్లున్నాయి. జొన్నలు 594కిలోలు ఉండాల్సి ఉండగా 106కిలోలు ఎక్కువగా ఉన్నాయి. వాటిపై డీఎస్ఓ ఆరా తీశారు. ప్రజలకు పంపిణీ చేసే బియ్యం తూకాల్లోనూ తేడా కనిపించింది. ఇక్కడ డీలర్ ఖలందర్ 20కిలోలకు 3కిలోలు కోత పెడుతున్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం రేషన్ షాపు సీజ్ చేశారు.

సీఎస్‌డీటీ బిజీ: డీఎస్ఓ తనిఖీలో బియ్యం తేడా ఉండటంతో సీఎస్‌డీటీ మహబూబ్‌బాషాను అక్కడికి రావాలని ఆదేశించారు. కానీ గంటన్నర దాటుతున్నా ఆయన వచ్చేలా కనిపించలేదు. దీంతో డీఎస్ఓ చేసేదేమీ లేక పై అధికారులకు ఫిర్యాదు చేశారు. చివరికి సీఎస్‌డీటీకి కలెక్టరేట్ నుంచి ఫోన్‌కాల్ వస్తే కానీ అక్కడికి రాలేకపోయారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

● కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం, ఇతర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకొని, ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలతో కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి, ప్రతి రైతు ఆ దిశగా ముందడుగు వేసేలా చొరవ చూపాలన్నారు.











మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించండి

తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని శాలివాహన కుమ్మరి సంక్షేమ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని డైరెక్టర్ వెంకట సుబ్బయ్య బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కోరారు. రాష్ట్రంలోని కుమ్మరి శాలివాహన సంఘం చైర్మన్ ఈశ్వర్, డైరెక్టర్లతో సోమవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవనంలో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కుమ్మరి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను డైరెక్టర్ వెంకట సుబ్బయ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాడిపత్రిలో శాలివాహన కుమ్మరి కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, కుమ్మరి శాలివాహనులకు వృత్తిపర పరికరాలు మంజూరు చేయాలని కోరారు.

ఎమ్మెల్యేతో సింగిల్‌విండో అధ్యక్షుడి భేటీ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

పుట్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు, డైరెక్టర్లు మంగళవారం అనంతపురంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆమె క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు గోవర్ధన్‌రాజు రైతుల సమస్యలపై చర్చించారు. తనను సింగిల్‌విండో అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆయన సన్మానించారు. ఆయన వెంట డైరెక్టర్లు ఆంజనేయులు, నాయకులు లింగమూర్తి, ప్రసాద్‌నాయుడు ఉన్నారు.

రోడ్లపై పంటలు ఆరబెట్టరాదు

విడపనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పంటలను రోడ్లపై ఆరబెట్టరాదని, తద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ రైతులను మంగళవారం హెచ్చరించారు. మండలంలోని అంచనహాలు, పొలికి, తిమ్మాపురం, గడేకల్లు, కడదరబెంచి, డొనేకల్లు గ్రామాల్లోని రైతులు మొక్క జొన్న, ఇతర పంటలను గుంతకల్లు-బళ్లారి 67వ జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేరా ఆరబెట్టుకున్నారు. వాటిని పరిశీలించిన ఎస్‌ఐ రైతులతో మాట్లాడారు. ఇది జాతీయ రహదారి కావటంతో రాత్రి, పగలు వేలాది వాహనాలు తిరుగుతుంటాయని, పంటలను రోడ్డుపై ఆరబెట్టుకోవడంతో ప్రమాదాలు సంబవించి ప్రాణనష్టం జరుగుతుందన్నారు. ఖాళీస్థలాల్లో పంటలను ఆరబోసుకోవాలని, వెంటనే రోడ్లను ఖాళీ చేయాలని హెచ్చరించారు.

స్వదేశీ వస్తువులనే వాడండి: బీజేపీ

గుంతకల్లు టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులనే వాడాలని బీజేపీ నాయకులు కోరారు. స్థానిక గుత్తిరోడ్డులోని కాయగూరల మార్కెట్ సమీపంలోని కాలనీలో మంగళవారం ప్రతి ఇంట స్వదేశీ.. ఇంటింటా స్వదేశీ అనే కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి, ఇంటికి స్టిక్కర్ అతికించారు. ఇందులో బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, ప్రధాన కార్యదర్శి వెంకటరాఘవ, నాయకులు కవితా శర్మ, నారాయణరెడ్డి, శివశంకర్, లక్ష్మీకిషోర్, గుర్రం సూర్యనారాయణ, విజయలక్ష్మి, బండారు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అక్రమంగా కల్లు విక్రయాలు

● ఆలయం పక్కనే దుకాణం
● పట్టించుకోని అధికారులు

బొమ్మనహాళ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా కల్లును యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. రాత్రింబవళ్లు కల్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాలువల పక్కన కల్లు దుకాణాలు ఏర్పాటు చేసినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ఇక ఏకంగా దేవాలయం పక్కనే ఓ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు, మహిళలు ఆలయానికి వెళ్లడానికే జంకుతున్నారు. కాలువల పక్కనే కల్లు దుకాణాలు ఉండటంతో తాగిన మైకంలో కాలువలో పడి చనిపోయే ప్రమాదముంది. బెళుగుప్ప మండలం నుంచి ప్రతి రోజూ.. ఉదయమే ఒక వాహనంలో కల్లును అక్రమంగా బొమ్మనహాళ్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. తమకు సొంత ఈత చెట్లు ఉన్నాయంటూ కొందరు అబద్దపు పత్రాలు చూపించి కల్లు దుకాణాలకు అనుమతులు పొందారు. బెళుగుప్ప నుంచి కల్లును తెప్పించుకొని విక్రయిస్తున్నారు. బొమ్మనహాళ్ కర్ణాటక ప్రాంతానికి సరిహద్దులో ఉండడంతో బళ్లారి, కోళగల్లు, ఎత్తినబూదేహాళ్, ఇంద్రపురం ప్రాంతలకు చెందిన యువకులు బైక్‌ల్లో గుంపులు... గుంపులుగా వచ్చి కల్లు తాగి.. మత్తులో గొడవలకు పాల్పడుతున్నారు. దీంతో గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని, అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



హెచ్చెల్సీ, దేవాలయం పక్కన ఏర్పాటు చేసిన కల్లు దుకాణాలు

తనిఖీ చేస్తాం

బెలుగుప్ప ప్రాంతం నుంచి కల్లు అక్రమ రవాణా అవుతున్నట్లు మాదృష్టికి రాలేదు. తనిఖీ చేసి ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. బొమ్మనహాళ్ మండలంలో ఈత చెట్లు లేవు. కణేకల్లుకు చెందిన డిపో నుంచి రవాణాకు అనుమతి ఉంది.

-ఉమాబాయి, ఎక్సైజ్ సీఐ కణేకల్లు



నేలపై బైఠాయించిన సర్పంచ్ భాగ్యమ్మ

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని పలువురు సర్పంచులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. నెలగొండ పంచాయతీలో కొత్త పనులు చేయడం లేదని, పాత పనులకు బిల్లులు ఇవ్వలేదని, గ్రామంలో సమస్యలు పరిష్కరించడం లేదని ఆ గ్రామ సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారంలో సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయంలో పాఠశాలల అభివృద్ధిపై జడ్పీటీసీ కదిరప్ప, వైసీపీ ఎంపీటీసీలు వాదోపవాదాలు చేసుకున్నారు. సర్వసభ్య సమావేశానికి చాలా మంది అధికారులు గైర్హాజర్ కావడంపై పలువురు ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగభూషణం, జడ్పీటీసీ కదిరప్ప పాల్గొన్నారు.

పీపీపీపై వైసీపీకి అవగాహన లేదు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బెళుగుప్ప, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్)పై వైసీపీ నాయకులకు ఏ మాత్రం అవగాహన లేదని, దీంతో నీచ రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున తగ్గుపర్తి రాధాకృష్ణ, ఎంపీపీ పెద్దన్న, విరుపాపల్లి రాధాకృష్ణ, ఆవులెన్న సర్పంచ్ రాములు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు.

అభివృద్ధికి అమిలినేని కృషి భేష్ : ఎంపీలు



మాట్లాడుతున్న అంబికా, వెంకటశివుడు యాదవ్, అమిలినేని, బీకే

కళ్యాణదుర్గం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేస్తున్న కృషి అమోఘమని ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ కొనియాడారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో వారు మాట్లాడారు. కనకదాసు, వాల్మీకి, వడ్డే ఓబన్న తదితరుల విగ్రహాల ఏర్పాటుతో పాటు.. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే తన సొంత నిధులతో చేపట్టారన్నారు. ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ.. మంత్రి నారాలోకేష్ కళ్యాణదుర్గానికి వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నానని, బహిరంగసభకు 40 వేల మందికిపైగా ప్రజలు వస్తున్నారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళంలో ఆంజనేయస్వామి రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పలు అభిషేకాలు నిర్వహించి.. ప్రత్యేకంగా అలంకరించారు. విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ, సభ్యులు గ్రామపెద్దలు గురుసిద్ధప్ప, ఓబయ్య, పురుషోత్తం, మహానంది, బసవరాజు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లవారిపల్లి సమీపంలో రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. అతను వయస్సు దాదాపు 60 సంవత్సరాలు ఉంటుందని, వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు

గుత్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పామిడి మండలంలోని నెమళ్లపల్లి, దేవరపల్లి గ్రామాల్లోని బెల్ట్ షాపులపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ ఉమాదేవి తెలిపారు. మొత్తం 46 మద్యం బాటిళ్లను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ వల్లాగోపాల్, ఈఎస్‌టీఎఫ్ ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిపల్లి, బట్టువానిపల్లి గ్రామాల మధ్య కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రూ. 13500, 11 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తికి గాయాలు

గుత్తిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ బైక్‌పై గుత్తికి మంగళవారం తెల్లవారుజామున వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. వన్నేదొడ్డి గ్రా మశివారులో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. గాయపడిన బాలకృష్ణను స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నరేష్, నగేష్

పుట్లూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు నరేష్, నగేష్ అనంతపురంలో మంగళవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ కురా ష్ పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ శివారెడ్డి అభినందించారు.

డిస్కస్‌త్రో పోటీలకు...

బ్రహ్మసముద్రం : అనంతపురంలోని నిర్వహించిన జిల్లాస్థాయి ఏపీ స్కూల్స్ గేమ్స్ అండర్- 14 డిస్కస్‌త్రో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వీ హేమశ్రీ ప్రథమస్థానం సాధించింది. దీంతో పిల్లలపల్లి గ్రామానికి చెందిన హేమశ్రీ శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

జిల్లాస్థాయి 'చెకుముకి'కి..

విడపనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టు పోటీ ల్లో స్థానిక జడ్పీ పాఠశాల విద్యార్థులు నసరీన్‌బేగం (టెన్త్), అనుప్రి యా (9వ తరగతి), విష్ణుప్రియా (8వతరగతి) ప్రతిభ చాటి జిల్లా స్థా యి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23న అనంతపురంలో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్‌ఎం సురేష్ బాబు తెలిపారు.



ఎంపికైన విద్యార్థినులు

● కణేకల్లు : స్థానిక జడ్పీహెచ్ బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి ట్యాలెంట్ టెస్టులో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు, లిటిల్ ఏంజిల్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసప్రసాద్, సీఆర్ ఎంటీ రాజేష్ తెలిపారు. జిల్లా స్థాయి టెస్ట్‌కు ఎంపికైన మోడల్ స్కూల్‌కు చెందిన అఖిల, హిందుప్రియ, కావ్య, లిటిల్ ఏంజిల్స్‌కు చెందిన తనుష్, స్నేహ, రక్షితను పలువురు అభినందించారు.



కణేకల్లు: విజేత విద్యార్థులు

రాయలచెరువు ఆనకట్ట పరిశీలన

యాడికి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు గ్రామంలోని చెరువు హెచ్చెల్సీ నీటితో నిండింది. దీంతో ఆ చెరువు ఆనకట్టను ఇరిగేషన్ అధికారులు మంగళవారం పరిశీలించి.. అవి భద్రంగా ఉన్నట్లు నిర్ధారించారు. చెరువుకు వస్తున్న హెచ్చెల్సీ నీటిని యాడికి కాలువకు మళ్లించినట్లు తెలిపారు. ఇందులో ఇరిగేషన్ ఈఈ రాము, డీఈ నాగేశ్వరశర్మ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, ఆయకట్టు సంఘం మాజీ ప్రెసిడెండ్ నారాయణప్ప పాల్గొన్నారు.

పశువుల తరలింపు

గుత్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్‌ఎస్‌లో రోడ్లపై సంచరిస్తున్న గోవులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబుబ్ బాషా.. సిబ్బందితో కలిసి పాత చెట్నెపల్లి పంచాయతీ కార్యాలయానికి మంగళవారం తరలించారు. వాటి యాజమానులను కార్యాలయానికి పిలిపించారు. మరోసారి పశువులను రోడ్లపై వదిలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానా విధించి గోవులను గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

గుత్తికి చేరిన ఎస్‌ఎఫ్‌ఐ జీపుజాతా

గుత్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన జీపుజాత మంగళవారం గుత్తికి చేరింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తరిమిల గిరి, పరమేష్ స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, జిల్లా సహాయకార్యదర్శి నవీన్, నాయకులు బాలాజీ, విజయ్, వంశీ, శివ, చరణ్ పాల్గొన్నారు.

భారీ వర్షం

యల్లనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 12.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రాము మంగళవారం తెలిపారు. ఈ వర్షంతో కోతదశలో ఉన్న మొక్కజొన్న, వరి పొలాలు తడిచిపోయాయి.

సీసీ రోడ్డుపై మురుగు నీరు



విడపనకల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ కొట్టాల బీసీ కాలనీకి (క్రిష్ణదేవ రాయలు) కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు పైనే ఇలా మురుగునీరు పారుతోంది. వైసీపీ ప్రభుత్వంలో ఈ సీసీ రోడ్డు వేశారు. కానీ కాలువలు ఏర్పాటు చేయక పోవడంతో ఇలా మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. సీసీ రోడ్డు మొత్తం పాచి పట్టి దుర్వాసన వస్తోందని, అనేక మంది జారి పడ్డారని బీసీ కాలనీవాసులు వాపోయారు. మురుగు కాలవలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

